

రాజంపేటలో ప్రత్యేక వాహనాల్లో ఎన్నికల సామగ్రితో పాటు ఈవీఎంలను తీసుకెళుతున్న సిబ్బంది



మదనపల్లె పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ కృష్ణారావు

నేడే పోలింగ్.. సర్వం సిద్ధం

- జిల్లాలో ఓటర్లు : 14,26,834
- పోలింగ్ కేంద్రాలు: 1609
- ఎన్నికల విధుల్లో 12,052 ఉద్యోగులు
- జిల్లాలో మొత్తం రూట్లు 247
- పోలింగ్ కేంద్రాలకు తరలిన.. ఈవీఎంలు, సిబ్బంది
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



సార్వత్రిక ఎన్నికలు నేడు జరగనున్నాయి. రాజంపేట పార్లమెంటు స్థానంతో పాటు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. జిల్లాలో మొత్తం 14,26,834 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం బాక్సులను తరలించారు. 12,052 మంది ఎన్నికల సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బలగాలను రప్పించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.



రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పాల్గొన్న అధికారులు



రాజంపేటలో ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ అభిషేక్ కిశోర్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు నుంచే అధికారులు ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టారు. దీంతో మార్చి 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చే నాటికే ఎన్నికల అధికారులకు శిక్షణ పూర్తి అయిపోయింది. అప్పటి నుంచి ఎటువంటి ఫిర్యాదు లేకుండా జాగ్రత్తలు తీసుకున్న జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయింది. అప్పటి నుంచి నామినేషన్లు మొదలయ్యాయి. ఏప్రిల్ 25 నాటికి నామినేషన్లు పూర్తయ్యాయి. రాజంపేట పార్లమెంటు స్థానానికి ఉపసంహరణలు, తిరస్కరణల తర్వాత 18 మంది బరిలో నిలిచారు. ఇందులో ప్రముఖంగా తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు కలిపి 80 మంది పోటీలో ఉన్నారు. ఇందులో తెలుగుదేశం, జనసేన, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలో బరిలో నిలిచారు.

14,26,834 మంది ఓటర్లు..

1609 పోలింగ్ కేంద్రాలు

పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అందులో 14,26,834 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 1609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12,052 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. 482 మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో ఉన్నారు. జిల్లాలో 453 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా, ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాతా జిల్లాలో ప్రతిపక్షాలపైన అధికార పార్టీ దౌర్జన్యాలకు పాల్పడింది. ఈ నేపథ్యంలో రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు.. పుంగనూరు, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ నియోజకవర్గాలలో వంద శాతం వెబ్‌కాస్టింగ్ కు ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా.. సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు చేరుకున్నాయి. ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రితో చేరుకున్నారు. రాయచోటి కలక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు ఎన్నికల సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఎటువంటి చిన్న పొరపాటూ జరగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

జిల్లాకు అదనపు బలగాలు

ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసులు పటిష్టచర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలలో గొడవలు, అల్లర్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సమస్యాత్మక కేంద్రాలను గుర్తించిన అధికారులు అక్కడ అదనపు బలగాలను మోహరిస్తున్నారు. రాజంపేట నియోజకవర్గంలో 288 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 76 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. రైల్వేకోడూరులో 252 పోలింగ్ కేంద్రాలకు గానూ..68 కేంద్రాలు, రాయచోటిలో 292 పోలింగ్ కేంద్రాలకు 84 సమస్యాత్మకంగా గుర్తించారు. తంబళ్లపల్లెలో 236 పోలింగ్ కేంద్రాలకు 60, పీలేరులో 281 పోలింగ్ కేంద్రాలకు 79 కేంద్రాలు, మదనపల్లెలో 260 పోలింగ్ కేంద్రాలకు 46 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇప్పటికే జిల్లాకు 11 కంపెనీల సీఏపీఎఫ్ (కేంద్ర బలగాలు), ఒక కంపెనీ ఏపీఎస్పీ (రాష్ట్ర బలగాలు), తమిళనాడు, కర్నాటక నుంచి అదనపు బలగాలను జిల్లాకు కేటాయించారు. వీళ్లతో పాటు స్థానిక పోలీసులు సైతం గట్టి ఏర్పాట్లు చేస్తున్నారు.


రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం నుంచి ఈవీఎంలను, ఎన్నికల సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులకు తరలించారు. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై పలు సూచనలు చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో శాంతిభద్రతల మధ్య పోలింగ్ నిర్వహించేలా, సామాన్య ఓటరు ధైర్యంగా వచ్చి ఓటుహక్కు వినియోగించుకునేలా పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల విధులు కేటాయించిన పోలీసులకు ఎస్పీ పలు సూచనలిచ్చారు.



రాయచోటిలో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్లు

జలయజ్ఞం.. నిర్వీర్యం

- ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి
- ఐదేళ్లుగా 50 శాతం కూడా జరగని ప్రాజెక్టుల పనులు
- రైతులను మోసగించిన వైసీపీ ప్రభుత్వం
- ఇదీ జిల్లాలో జలయజ్ఞం పనుల తీరు



పింఛా ప్రాజెక్టు కట్ట తెగిపోయిన చోట నత్తనడకన సాగుతున్న పనులు

రాయచోటిటౌన్, మే 12: వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసింది. పేరుకేమో అన్నీ చేశామని చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మాత్రం చేసిందేమీ లేదు. ఒక్క ప్రాజెక్టు కూడా ఇప్పటివరకు పూర్తి చేయలేదు. నిధులు వేల కోట్లు విడుదల చేశామని చెబుతున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వ్యవసా యంపై ఆధారపడి జీవిస్తున్న రైతన్నలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో చేపట్టిన పనులు జిల్లాలో నిర్వీర్యమయ్యా యి. సుమారు రూ.7 వేల కోట్లతో ఆరు ప్రాజెక్టులను జిల్లాలో చేపడుతున్నా మని వైసీపీ చెబుతున్నా ఈ ఐదేళ్ల పాలనలో కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడం చూస్తే ఈ ప్రభుత్వం రైతన్నలకు ఎలాంటి ప్రా ధాన్యం ఇస్తుందో ఇట్టే తెలిసిపోతుంది. ఐదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ రైతన్నల సంక్షేమం కోసం పాటుపడుతోందని గొప్పలు చెప్పు కోవడంతోనే సరిపోయింది కానీ రైతన్నలకు మేలు చేసే విధంగా జిల్లాలో ఎలాంటి పనులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రధానంగా వైసీ పీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఆరు ప్రధాన ప్రాజెక్టులకు రూ.7 వేల కోట్లు నిధులను కేటాయిస్తూ పరిపాలనా ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో భాగంగానే గాలేరు-నగిరి ప్రాజెక్టు నుంచి హంద్రీ-నీవా ప్రాజెక్టుకు లిఫ్ట్ స్కీం ద్వారా గండికోట నుంచి ప్రారంభమైన పనులు తంబళ్లపల్లె వరకు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.536 కోట్లు మంజూరు చేసింది. అయితే ఆ పనులు ఇప్పటి వరకు 25 శాతం కూడా పూర్తి కాకపోవడం చూస్తే అటు ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇటు అధి కారుల అలసత్వం కనిపిస్తోంది. కేవలం నిధులు మంజూరు చేసినట్లు రైతు లను ఈ ప్రభుత్వం మభ్యపెడుతోందన్న విమర్శలున్నాయి.

కాలేటివాగు ప్రాజెక్టు నుంచి రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని చెరువులకు నీరు నింపేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద ప్రభుత్వం రూ.227.10 కోట్లు మంజూరు చేసింది. గత ఐదేళ్లలో ఈ పనులు 50 శాతం మాత్రమే జరిగాయి. అలాగే రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండలంలో గల వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ 50కిలోమీటర్ల మేర మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుదారులకు సాగునీరు అందిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. అంతేగాక రాజంపేట నియోజకవర్గం సుండుపల్లె మండలంలో గల పింఛా ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో పాలకుల అలసత్వంతో రైతులు నెత్తి నోరు మొత్తుకున్నా మరమ్మతులకు నోచుకోకపోవడం వలన రెండు సంవత్సరాల క్రితం వరదల్లో ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఆ ప్రాజెక్టు కట్ట పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.84.33 కోట్లు మంజూరు చేయగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రాజంపేట నియోజకవర్గంలోని ఆకేపాడు సమీపంలో చెయ్యేరు నదిపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టు విషయానికి వస్తే ప్రాజెక్టుపై పర్యవేక్షణాలోపం అధికారుల పూర్తి స్థాయి నిర్లక్ష్యం, పాలకుల స్వార్థ ప్రయోజనాలతో వరదల తాకిడికి ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయి దిగువ ప్రాంతాల్లోని పలు గ్రామాలు నీట మునగడమే కాకుండా కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో పలువురు మృత్యువాత పడడమే కాకుండా ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ అక్కడ ప్రభుత్వం ఎటువంటి పునరావాస కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.787.77 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పినా పనులు మాత్రం మొదలు కాలేదు. అయితే ఇప్పటి వరకు అన్నమయ్య ప్రాజెక్టు వద్ద ఎటువంటి పనులు మొదలు కాలేదు. దీంతో అన్నమయ్య ప్రాజెక్టు దిగువ భాగంలోని గ్రామాల రైతులతో పాటు ఆయకట్టుదారులు ప్రభుత్వంపై పూర్తి స్థాయిలో ఆశలు వదులుకున్నారు. నూతనంగా ఏర్పడే ప్రభుత్వమైనా ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి సాగునీరు అందించాలని అన్నమయ్య ప్రాజెక్టు కింది భాగంలోని ఆయకట్టుదారులు కోరుతున్నారు. అంతేగాక జిల్లా పరిధిలోని తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడు సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.759.50 కోట్లు నిధులను మంజూరు చేయగా ఇప్పటి వరకు 50శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రూ.5 వేల కోట్లతో చేపడుతున్న జలయజ్ఞం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారు కావడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సాగునీరు అందక ప్రాజెక్టులు పూర్తికాక పంటల సాగులేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టులను పూర్తి చేస్తాం ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అధికారంలోకి రాగానే గొప్పలు చెప్పిన సీఎం జగన్ సొంత జిల్లాలోనే ప్రాజెక్టు పనులను గాలికొదిలేయడంతో ఈ ప్రాంత రైతన్నలు ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్నారు. ఏది ఏమైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన ఐదేళ్లలో జలయజ్ఞం పనులు నిర్వీర్యం అయ్యాయనడంలో సందేహం లేదు. ఈ జలయజ్ఞం పనులు ఎప్పుడు పూర్తవుతాయో పంట పొలాలకు సాగునీరు ఎప్పుడు వస్తుందో అనే ఎదురుచూపులు జిల్లా రైతాంగానికి తప్పడం లేదు.

పోలింగ్ శాతం పెంచడానికి మోడల్ పోలింగ్ కేంద్రం



పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్

పీలేరు, మే 12: ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడానికి ఎన్నికల కమిషన్ ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తులో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఒక నమూనాలాగా తీసుకుని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని దానిలాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసుకుని అందులో సకల సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో భాగంగా పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం 246ను మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసి అందులో ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలన్నీ కల్పించింది. దానికి ఒక వీఆర్వోను బాధ్యుడిగా నియమించి సౌకర్యాల కల్పన బాధ్యత అప్పగించింది. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు, క్యూలో నిలబడిన సమయంలో జిల్లా సమాచారం, దాహం వేసిన వారికి మంచినీరు, అవసరమైన వారు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సందర్శించే అవకాశం ఉందని వీఆర్వో, మోడల్ పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జ్ శిల్ప తెలిపారు.

ఓటుపై మక్కువ పెంచేందుకు..




సాధారణంగా చాలా మంది ఓటు వేసేందుకు నిరాసక్తత చూపుతుంటారు. పోలింగ్ శాతాన్ని పెంచే ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను డిజైన్ చేసింది. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు 246 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దాము. ఓటు వేసే ప్రక్రియను ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రయత్నించాము.

- శిల్ప, మోడల్ పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జ్

ఓటు.. వజ్రాయుధం





పీలేరు, మే 12: ఓటు అనే రెండు అక్షరాలు ప్రపంచగతిని మార్చే శక్తి. ఓటు అనేది వ్యక్తి అస్తిత్వాన్ని తెలియజేస్తుంది. వ్యవస్థలో మార్పునకు నాంది పలుకుతుంది. మనోభావాలు వ్యక్తపరిచేందుకు ప్రజల చేతుల్లో ఉన్న ఏకైన ఆయుధం ఓటు. రాజకీయ పార్టీల జాతకాలు మార్చాలన్నా, భ్రష్టుపట్టిన వ్యవస్థకు చరమగీతం పాడాలన్నా ప్రజల్లో చేతుల్లో ఉన్న వజ్రాయుధం ఓటు. ప్రజాగళం వినపడాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఒక్క ఓటు ప్రభుత్వాలను కూలగొట్టగలదు, ప్రజాస్వామ్యాన్ని బతికించగలదు. కోట్లు పోసి ఓట్లు కొనుగోలు చేసిన వారిని సైతం నడిబజారులో నిలబెట్టగల పదునైన ఆయుధం ఓటు. అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. ప్రస్తుత పాలకులపై మనకున్న వ్యతిరేకతను వ్యక్తం చేయాలన్నా, పాలనలో మార్పు రావాలని కోరుకున్నా అది ఓటు వేయడం ద్వారానే సాధ్యం. అందుకే ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగ కోసం రాజకీయ పార్టీల దగ్గర నుంచి స్వచ్ఛంద సంస్థల వరకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తుంటారు. రాజ్యాంగం మనకు అందించిన ఓటు హక్కును తాత్కాలిక తాయిలాలకు అమ్ముకోకుండా మన భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునే అవకాశంగా మలుచుకోవాలని ఉపదేశిస్తూ ఉంటారు. ఐదేళ్లకోసారి మాత్రమే అందే అటువంటి మహత్తరమైన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఈరోజు అందరి చేతుల్లో ఉంది. ఎటువంటి భయాలు, ఆందోళనలు, అపోహలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా దానిని వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే అవకాశం నేడు మన చేతుల్లో ఉంది.

పోలింగ్ శాతం పెంచేందుకు కసరత్తు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దగ్గర నుంచి స్థానిక సంస్థల వరకు గత ఏడాదిగా తీవ్రంగా కసరత్తు చేశారు. అందులో భాగంగా గతంలో ఉన్న 21 ఏళ్ల నిబంధనను కూడా సడలించి 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారు. ఏడాది కింద నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి ఇటీవలి కాలం వరకు దానిని కొనసాగించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. యువతను పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యుల్ని చేసేందుకు ప్రతి కళాశాలకు వెళ్లి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించడమే కాకుండా ఓటు హక్కు పొందిన తరువాత దానిని విధిగా వినియోగించుకోవాలని చైతన్యవంతుల్ని చేశారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలోనూ 'స్వీప్' పేరిట సామాన్య ప్రజలకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం చేసిన కృషి కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం ఓటరు నమోదు కార్యక్రమంపైనే కాకుండా పోలింగ్ శాతం పెంచేందుకు కూడా ప్రభుత్వ యంత్రాంగం విశేష కృషి జరిపింది. అందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి వాటిలోని అసౌకర్యాలను దూరం చేసి సౌకర్యాలు కల్పించింది. పోలింగ్ రోజును పండుగలా భావించాలని, ఆరోజు ఎన్ని పనులు ఉన్నా వాయిదా వేసుకోవాలని, ఓటు వేయడాన్ని ప్రథమ ప్రాధాన్యతగా ఎంచుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం ప్రత్యేక ఆహ్వానపత్రికను ఆవిష్కరించి ఓటర్లను ఓటు వేసేందుకు ఆహ్వానించారు. ప్రభుత్వం చేసిన కృషి ఫలించి ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వివిధ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూర్లకు చేరుకుంటున్నారు.

బతికున్నా చచ్చినట్టే..



నాకు 75 ఏళ్లు. నాకు ఓటు వేసే వయస్సు వచ్చినప్పటి నుంచి ఓటు వేస్తున్నా. నేను కొత్తగా ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు పెద్దగా సౌకర్యాలు లేవు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఓటు వేసే వాళ్లకు కూడా గవర్నమెంటు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోంది. అందరూ ఓటు వేయాలి. ఓటు వేయకపోతే మనం బతికున్నా చచ్చినట్లే లెక్క.

- కె.మహబూబ్‌బీ, పీలేరు


ఓటు వేసేందుకు బెంగళూరు నుంచి వచ్చా..



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నా. పీలేరులో ఓటు హక్కు వినియోగించుకోవాలని రెండు రోజుల క్రితమే వచ్చా. మనకు ఇష్టమైన నాయకుడికి ఓటు వేయడంలో ఉన్న మజా మరెక్కడా దొరకదు. ఓటు వేసిన వారికే ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు ఉంటుంది. ఎవరు ఎవరికైనా ఓటు వేసుకోవచ్చు, కానీ ఓటు వేయడం మన విధి. ఒకవేళ ఎవరూ నచ్చకపోయినా ఇప్పుడు నోటా అవకాశం ఉంది. దానికైనా వేయాలి గానీ వేయకుండా మాత్రం ఉండిపోకూడదు.

- ఆర్.శ్రీనివాసులు రెడ్డి, పీలేరు

తొలి ఓటు కోసం హైదరాబాదు నుంచి వచ్చా..



నాకు ఈసారే ఓటు వచ్చింది. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నా తొలిసారి ఓటు వేసే అవకాశం మిస్ కాకూడదని వచ్చేశా. ఎలక్షన్స్‌లో ఓటు వేయాలని ఎంతో ఆశపడి ఓటరుగా నమోదు చేసుకున్నా. కాసింత ఖర్చు అయినా ఓటు వేయాలని పీలేరుకు వచ్చా. అందరూ కూడా మిస్ కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి. మనం ఓటు వేసిన వారు ప్రభుత్వంలోకి వస్తే ఆ కిక్కు వేరుగా ఉంటుంది. ఆ కిక్కును అందరూ ఎంజాయ్ చేయాలంటే మొదట విధిగా ఓటు వేయాలి.

- మహమ్మద్ అష్ఫాక్, పీలేరు

నీళ్లున్నా.. తప్పని కన్నీళ్లు..!

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- దాహం తీర్చని తాగునీటి పథకం
- గాలివీడు మండల ప్రజల మండిపాటు



గొట్టివీడులో తోపుడుబండి పై నీరు తీసుకెళుతున్న మహిళ



నీటితో కళకళలాడుతున్న వెలిగల్లు ప్రాజెక్టు

గాలివీడు, మే 12: వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్ల పుష్కలంగా ఉన్నా గాలివీడే ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. . వేసవి వచ్చిందంటే జనం గుండెల్లో రైళ్ల పెరిగెడుతున్నాయి.ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని వారు ఆరోపిస్తున్నారు.. 33 కిలోమీటర్ల దూరంలోని రాయచోటి పట్టణానికి వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నీరు అందిస్తున్న ప్రభుత్వ పెద్దలు, పక్కనే ఉన్న గాలివీడు మండలంలోని కొన్ని గ్రామాలకు కూడా తాగునీటిని అందించలేక పోవడం దారుణమని వాపోతున్నారు. తాను గెలిస్తే వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామని మాట ఇచ్చిన వైసీపీ నేత అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో కూలినాలి చేసుకుని జీవించే పేదవాళ్లు తాగునీటి కోసం పనులు వదులుకోవాల్సి వస్తోంది.

దాహం తీర్చలేని మంచినీటి పథకం

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నూలివీడుకు రూ1.5కోట్లతో పైపులైన్ ద్వారా నీరు అందించే పనులు పూర్తి చేసి పేరంపల్లె, గుండ్లచెరువు, నూలివీడు పంచాయతీలోని 40 పల్లెలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం పేరంపల్లె వద్ద పంప్‌హౌస్ నిర్మించారు. అయితే, ఇందుకోసం 140 ఎంఎం పైపులు వినియోగించడంతో వాటి ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు. 40 పల్లెల్లో 4 వేల మందికిపైన జనాభా ఉంది. ఒక్కో వ్యక్తికి రోజుకు 40 లీటర్ల అవసరం కాగా, ఈ లెక్కన 4 వేల మందికి రోజుకు ఒక లక్షా 60 వేల లీటర్ల నీరు అవసరం. కానీ ఈ పథకం ద్వారా కనీసం అందులో సగం కూడా నీరు సరఫరా కావడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ముందు చూపు లేకపోవడం తాగునీటి సమస్యకు కారణమైంది. పేరంపల్లె, గుండ్లచెరువు, గాలివీడు పంచాయతీల్లో ఎంత జనాభా ఉంది. ఎన్ని మూగజీవాలు ఉన్నాయి. రాబోయే 10, 20 ఏళ్లలో ఏ మేరకు జనాభా పెరగవచ్చు అనే ముందు చూపు లేకుండా ఈ పథకాన్ని ఏర్పాటు చేయడమే ఈ కష్టాలకు కారణమని పలువురు అంటున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఎన్నడూ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో అన్ని గ్రామాలకు సాగు, తాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలికిన వైసీపీ ప్రజాప్రతినిధులు సాగునీరు అంటే ఎలాగూ అందించలేదు. కనీసం తాగునీరు కూడా అందించలేక పోవడం వారికి సిగ్గుచేటని స్థానికులు అంటున్నారు. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్ల ఉన్నా వాటిని ప్రజలకు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నది. ఇలాంటి ప్రభుత్వం తమకు అవసరమా అని ప్రశ్నిస్తున్నారు.

నీళ్లున్నా.. ఫలితం లేదు



వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లున్నా.. పల్లెలకు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఐదేళ్ల కాలంలో ఏనాడూ తాగునీటి సమస్యను పరిష్కారంపై కనీసం చర్చించలేదు. ప్రతి పల్లెలో తాగునీటి సమస్య ఏర్పడింది. నీళ్ల దొరకక పోవడంతో మూగజీవాలను అమ్ముకోవాల్సి వస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలు పల్లెలను వదిలి వెళ్లిపోయే అవకాశం ఉంది.

\- పెద్దు ఈశ్వర్‌రెడ్డి, నక్కలవాండ్లపల్లె

విద్యుత్ కొరతే సమస్య

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 5 ఇంచుల పైపు ద్వారా పేరంపల్లె నుంచి నూలివడు వరకు రహదారులకు దగ్గరలోని పల్లెలకు తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం పగలు 5 గంటలు, రాత్రి రెండు గంటలు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేస్తున్నాం.

\- ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు



పీలేరులో శంకర జయంతి నిర్వహిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

పీలేరు, మే 12: ఆది శంకరాచార్యుల జయంతిని ఆదివారం పీలేరులోని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌లోని బ్రా హ్మణ సంఘ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉదయం స్వా మి వారికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, మహిళలు లలితా సహస్రనామావళి నిర్వహించారు. అనంతరం ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యు లు ఉద్యా ఫణీంద్ర శర్మ, రెడ్డిసుబ్రహ్మణ్యం, సూత్రం కిరణ్ కుమా ర్ శర్మ, అప్పిస్వామి, ఆనంద్ స్వామి, కృష్ణప్రసాద్ స్వామి, సంతోశ్ స్వామి, తెనాలి గిరిధర్ రావు, శ్రీకాంత్, లలితాంబ, రెడ్డిభావిక, మధుబాల, భరత్ పాల్గొన్నారు.

మదనపల్లి అర్బన్‌లో: స్థానిక కురవంకలో బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవా లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివస్వామి, చ లపతి స్వామి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య మా ట్లాడుతూ శ్రౌత, స్మార్తక కర్మలను పునర్ధరించి వైదిక మతా న్ని పునఃస్థాపితం చేయడానికి స్వయంగా శంకరుడే భూమి పై అవతరించాడన్నారు. ఆ వైదిక ధర్మాన్ని ప్రతిష్ఠించి నిరం తరంగా కొనసాగడానికి ఆసేతుహిమాచలం వరకు కాలిన డకన మూడు సార్లు పర్యటించి దేశానికి నలువైపులా నాలు గు పీఠాలను స్థాపించిన మహనీయ్యుడు శంకరాచార్యులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

మదనపల్లె టౌన్, మే 12: మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో శనివారం రాత్రి ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి వచ్చి అత్యవసర విభాగంలో హల్‌చల్ చేశాడు. కలకడ మండలం మహల్‌కు చెందిన బాషా అనే వ్యక్తి ఒళ్లు బాగలేదని రాత్రి క్యాజువాలిటికి వచ్చాడు. అక్కడి వైద్య సిబ్బంది మరుసటి రోజు ఉదయం అవుట్ పేషెంట్ విభాగంలో చూపించుకోవాలని సూచించారు. దీంతో బాషా గట్టిగా అరుస్తూ, మద్యం మత్తులో చిందులేశాడు. అంతే కాకుండా చెప్పులు తీసి విసురు తూ ఎగిరి గంతులు వేశాడు. అంతేకాకుండా అక్కడ వుంచిన కుర్చీలు, బెంచీలు ఎక్కి బ్యానర్లను చించుతూ హంగామా చేశారు. దీంతో అక్కడడ్యూటీ డాక్టర్లు, వైద్యసిబ్బంది హడలెత్తిపోయారు. అతడిని వారించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది బెంబేలెత్తి చూస్తూ ఉండిపోయారే కాని, అతని హంగామాను అడ్డుకోలేకపోయారు. చివరికి బాషా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక కిట్ల పంపిణీ

మదనపల్లె టౌన్, మే 12: ఎన్నికల సంఘం ఆదేశాలతో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే అధికారులకు రిటర్నింగ్ అధికా రులు ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక కిట్ చొప్పున పంపిణీ చేశారు. ఈ బ్యాగ్‌లో ఆరు టూత్ బ్రష్షులు, ఒక టూత్‌పేస్ట్, ఆరు టంగ్ క్లీనర్లు, ఆరు సోపులు, ఆరు క్రాక్‌జాక్, ఆరు గుడ్‌డే బిస్కెట్‌ప్యాకెట్లు, ఒక చాక్లెట్ ప్యాకెట్‌తో పాటు ఒక శానిటరి నాప్ కిన్ ప్యాకెట్‌ను ఈ కిట్‌లో వుంచారు. అన్ని పోలిం గ్ కేంద్రాల సిబ్బందికి ఎన్నికల సామాగ్రితో పాటు వాటిని పంపిణీ చేశారు.

పోలింగుకు సర్వం సిద్ధం

- అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల నుండి ప్రత్యేక వాహనాల్లో ఈవీఎంల తరలింపు ● ఏర్పాట్లను పర్యవేక్షించిన కేంద్ర ఎన్నికల అబ్జర్వర్స్, కలెక్టర్



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



రైల్వేకోడూరు: ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

రాజంపేట, మే 12: నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం నియోజకవర్గ ఎన్నికల అధికారులు, 288 పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాల అధికారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సూచనలు చేశారు. ఎన్నికల కేంద్ర అబ్జర్వర్లు, ఓంప్రకాష్, ఎస్ జి మూన్, రవీందర్‌లతో కలిసి నియోజకవర్గ ఎన్నికల అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈవీఎం లను 288 పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, ఎన్నికల సామగ్రిని తరలించామ న్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్ ప్రకారం ఈవీఎంలను తరలించామన్నారు. ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈవీఎంలు తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చినట్లు తెలిపారు.

● 41 రూట్లలో ఈవీఎంల తరలింపు

125వ నెంబరు రాజంపేట సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల నుంచి 41 రూట్లలో ఈవీఎంలు తరలించినట్లు రాజంపేట ఎన్నికల అధికారి మోహన్‌రావు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో 76 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. నియోజకవర్గంలో 288 పోలింగ్ కేంద్రాలు ఉండగా సిద్దవటంలో 1 - 40 పోలింగ్ బూత్‌లు, ఒంటిమిట్ట 41 - 72 పోలింగ్ కేంద్రాలు, నందలూరులో 73 - 108 పోలింగ్ కేంద్రాలు, రాజంపేటలో 109 - 201 , 134 ఎ పోలింగ్ కేంద్రాలు, వీరబల్లి 202 - 235 పోలింగ్ కేంద్రాలు, సుండుపల్లి 236- 287 కేంద్రాలకు ఈవీఎంలు తరలించినట్లు వివరించారు

రైల్వేకోడూరు: నియోజవర్గంలో పోలింగ్‌కు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం అనంతరాజుపేట ఉద్యాన కాలేజి ఆవరణలో ఎన్నికల అధికారిణి లీలారాణి ఆధ్వర్యం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ అధికారులకు అందజేశారు. సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్‌టీసీ బస్సులు, వ్యాన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి తమిళనాడు పోలీసులను కేటాయించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 500 మందిని కేటాయించారు. వీరితోపాటుగా కేంద్ర బలగాలు కూడా ఉంటాయని, పోలీసు అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ బాబూజీ, రాజంపేట డీఎస్పీ చైతన్య విధులు కేటాయించారు. పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల అధికారిణి లీలారాణి తెలిపారు.



రైల్వేకోడూరు: బందోబస్తు ఏర్పాట్లలో అదనపు ఎస్పీ రాజ్‌కమల్

కోడూరులో కూటమి జోష్

- ముక్కా రూపానందరెడ్డి సమన్వయంతో కలసి పనిచేసిన ముఖ్య నేతలు ● చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాకతో మరింత పట్టు

రైల్వేకోడూరు, మే 12: ఎస్సీ నియోజకవర్గ మైన కోడూరులో మొదట టీడీపీకి టిక్కెటు కేటాయించా లని ముఖ్యమైన నేతలు భావించారు. అయితే కోడూరు స్థానాన్ని కూట మిలో భాగంగా జనసేనకు టిక్కెటు కేటాయించాలని టీడీపీ అధిష్టానం నిర్ణయిం చింది. దీంతో మొదట జనసేన పార్టీ తరపున ఒకరికి టిక్కెటు కేటాయిస్తూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నిర్ణయించి ప్రజల్లోకి పంపారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి స్వగ్రామైన ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్‌కు జనసేన పార్టీ కండువా కప్పించి టిక్కెట్టు ఇప్పించారు. దీంతో నియోజకవర్గంలో అన్ని వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రచారం చేయడంతో రైల్వేకోడూరులో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థికి కలసి వచ్చింది. టీడీపీ రైల్వే కోడూరు ఇన్‌చార్జ్ మార్పు కూడా కూటమికి కలసి వచ్చింది. అంతేకాకుండా రైల్వేకోడూరుకు ప్రచారం నిమిత్తం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రావడంతో నాయకుల్లో, కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగి పట్టు బిగించింది. రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి రైల్వేకోడూరులో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. నియోజకవర్గమైన కోడూరులో ముఖ్యమైన నేతలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. రైల్వేకోడూరు పట్టణంలో ప్రముఖ సినీ నటులు పృధ్వీరాజ్, కమెడియన్ సద్దాంలు ముమ్మరంగా ప్రచారం చేశారు. మైనార్టీల్లో ఉత్సాహం పెంచారు. రైల్వేకోడూరు పరిశీలకుడు హేమాంబరధర రావు నాయకులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ కూటమిని ముందుకు నడిపించడంలో సఫలీకృతులయ్యారు. టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానంద రెడ్డి అన్నీ తానై జనసేన గెలుపు కోసం తన భుజస్కందాలపై వేసుకున్నారు. ప్రచారానికి తన కుటుంబ సభ్యులను ప్రజలతో మమేకం చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు షణ్ముఖ వ్యూహంతో జనసేనను ముందుకు నడిపించారు. ఎంఆర్‌పీఎస్, మైనార్టీలు, దళిత, గిరిజన, అగ్ర కులాలకు చెందిన నాయకులు మరింత బలాన్ని ఇచ్చారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంతో నియోజక వర్గంలో కూటమి విజయం సులభంగా మారింది.



రైల్వేకోడూరు ప్రచారంలో భాగంగా వచ్చి మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్, చంద్రబాబు (ఫైల్)



అగ్రనేతల రాకతో భారీ ఎత్తున జనాలు వచ్చిన దృశ్యం (ఫైల్)

పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు బిజీ



ఎన్నికలకు సిద్ధమైన పోలింగ్ కేంద్రం

లక్కిరెడ్డిపల్లె మే 12; సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం మండలంలోని 33 పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 200 మంది పోలింగ్ ఆఫీసర్లు వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. . వెబ్ కాస్టింగ్‌తోపాటు సమస్యాత్మక కేంద్రాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు మోహరించాయి. సీఐ జీవన్‌గంగనాథబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు

ఓబులవారిపల్లె: మండలంలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు.పోలింగ్ ఏజెంట్ల వివరాలు నమోదు చేయడానికి కావాల్సిన పత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ఆరుగురు సిబ్బంది, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు.

రాజంపేటటౌన్: రాజంపేట మండలంలో ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీబిజీ అయ్యారు. రాజంపేట పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. చలువపందిళ్లు, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. రాజంపేట మండలంలో సుమారు 109పోలింగ్ బూత్ నుండి 201 వరకు 92పోలింగ్ బూత్‌లలో అధికారులు నిమగ్నమయ్యారు. పోలింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది ఓటింగ్ సమయంలో తీసుకోవాల్సిన పనుల్లో నిమగ్నమయ్యారు.

ఒంటిమిట్ట: మండలంలోని అన్ని పోలింగ్‌బూత్‌లలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తర లించారు. సమస్యాత్మక కేంద్రాలలో వెబ్‌కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్‌లకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 32 బూత్‌లలో పోలీసు సిబ్బంది, పోలింగ్ సిబ్బంది ఏజెంట్ల కోసం, ప్రజల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. వృద్ధుల కోసం ప్రత్యేక ర్యాంపును, వికలాంగుల కోసం వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎండవేడిమిని తట్టుకునేందుకు టెంట్లను ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.



పోలింగుకు సిద్ధంగా ఉన్న కేంద్రం

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గాలివీడు, మే 12: పోలింగ్ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటప్రసాద్ హెచ్చరించారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 44 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. మండలాన్ని 6 రూట్లుగా విభజించామని ఒక్క రూటుకు ఒక్కో మొబైల్ టీం పర్యవేక్షిస్తుందన్నారు. 2 యూఆర్‌పీ టీములు ఉంటాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు పోలింగ్ కేంద్రం వద్ద గుంపులు,గుంపులుగా ఉండరాదని, పార్టీల ఏజెంట్లు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి సహకరించాలని తెలిపారు.

పోలి సుబ్బారెడ్డికి సుగవాసి సునీల్ పరామర్శ

రాజంపేట, మే 12: రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సమీప బంధువు, రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి సునీల్ పరామర్శించారు. ఎన్నికల సందర్భంగా వైసీపీ నేతల దాడిలో గాయపడ్డ పోలి చిన్నసుబ్బారెడ్డిని వారి సోదరుడు సుబ్బారెడ్డిని పరామర్శించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో నందలూరు మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరస య్య, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్య, మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, దంత వైద్యులు డాక్టర్ నవీన్, మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా తదితర నేతలు పరామర్శించారు.

'డబ్బులిచ్చి ఉప సర్పంచయ్యాడు!'

- రైల్వే కోడూరులో కరపత్రం కలకలం

రైల్వేకోడూరు, మే 12: పంచాయతీ ఉపసర్పంచ్ పై రైల్వేకోడూరులో ఆదివారం విడుదలైన కరపత్రం కలకలం రేపింది. వైసీపీ మద్దతుతో గెలుపొందిన ఆయన అవినీతి, కుటుంబ వివరా లను అయనపై పోటీ చేసిన వార్డు మెంబరు పేరుతో అందులో పేర్కొనడంపై ప్రజలు విస్తు పోతున్నారు. కరపత్రంలోని వివరాల మేరకు సొంత వార్డులో కూడా పోటీ చేసే ధైర్యం లేక జగడంపల్లెలో డబ్బులు ఇచ్చి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని, కేవలం డబ్బులు ఉండడంతోనే తాను ఉప సర్పంచ్‌గా ఎన్నిక య్యాడని అందులో ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి అప్రూవల్ కు గతంలో రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు ఖర్చవుతుండగా, ఈయన లక్షలాది రూపా యలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటు న్నాడని, పేద, మధ్య తరగతి కుటుంబాలను జలగలా పట్టి పీడిస్తున్నాడని విమర్శించారు. ఉప సర్పంచ్ ఆగడాలపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదని పేర్కొన్నారు. తమ దాయాదు లను బెదిరించి వారి ఆస్తులు లాక్కున్నాడని, రైల్వేకోడూరులో వైసీపీ గెలవకూడని ప్రచారం చేస్తున్నాడంటూ కరపత్రం విడుదల చేయడం ఆ పార్టీలో కలకలం రేపింది. వైసీపీ వారే ఈ కరపత్రం విడుదల చేసి ఉంటారని ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై ఉప సర్పంచ్‌ని వివరణ కోరగా తాను రాజకీయంగా ఎదుగుతుండడం ఓర్వలేక కరపత్రాలు వేస్తున్నారన్నారు.

సమరోత్సాహంలో టీడీపీ

- ఆత్మరక్షణ స్థాయి నుంచి ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించే స్థాయికి
- నారా లోకేశ్ 'యువగళం' తరువాత పెరిగిన జోష్
- శ్రేణుల మధ్య ఐక్యత పెంచిన అంగళ్లు, పుంగనూరు కేసులు
- ప్రధాని సభ సక్సెస్‌తో మరింత ఉత్సాహం



పీలేరు, మే 12: ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలన్న కసితో పీలేరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నారు. గడిచిన ఐదేళ్లుగా ఎదుర్కొన్న అవమానాలు, అక్రమ కేసులు, కక్ష సాధింపులకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో దూసుకెళుతున్నారు. ఐదేళ్ల నాడు ఆత్మరక్షణ స్థాయిలో ఉండి పార్టీలో ఉన్న వారిని కాపాడుకుంటే చాలు అన్న స్థితి నుంచి ప్రస్తుతం ప్రత్యర్థి పార్టీకి ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరుకుంది టీడీపీ. వైసీపీ నాయకుల ఆక్రమణలే ఆలంబనగా, వారి అక్రమాలే ప్రచారాస్త్రాలుగా పోరాటం ఆరంభించిన పీలేరు టీడీపీ శ్రేణులకు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తోడురాగా, విజయవంతమైన అగ్రనేతల పర్యటనలు, ప్రచార సభలు కలిసివచ్చి నేడు గెలుపు దిశగా కృషి చేస్తున్నాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సాగించిన 'పోరాట' రాజకీయాలు ఫలించి 2019లో ఆత్మరక్షణలో ఉన్న స్థాయి నుంచి వైసీపీకి ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరుకుంది. యువనేత నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు పీలేరు నియోజకవర్గంలో అనూహ్య స్పందన లభించడంతో ధైర్యంగా వీధుల్లోకి వచ్చిన పార్టీ శ్రేణులు, ఎక్కడికక్కడ అధికార పార్టీపై సాగించిన పోరాటాల కారణంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, ప్రత్యర్థి పార్టీలోని నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలోకి రావడం ప్రారంభమైంది. ఆ తరువాత జరిగిన చంద్రబాబు 'ప్రజాగళం' ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సభ సూపర్ సక్సెస్‌తో పీలేరు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు కదం తొక్కుతున్నారు.

వైసీపీ నేతల ఆక్రమణలే ఆలంబనగా చెలరేగిన నల్లారి

2019 ఎన్నికల తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నల్లారి కుటుంబాన్ని ఒంటరిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పీలేరులో రాజకీయాలు సాగించారు. 2019 ఎన్నికల్లో రెండవసారి ఓటమి ఎదురైనా, ప్రత్యర్థి వర్గం పదేపదే ఇబ్బంది పెడుతున్నా, నమ్ముకున్న వారు వరుసగా వైసీపీలో చేరిపోతున్నా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధైర్యం కోల్పోకుండా పార్టీని, తనను నమ్ముకున్న ద్వితీయ శ్రేణి క్యాడర్ నాయకులతోనే పార్టీని నడిపించారు. ఆ క్రమంలో ఆయనకు వైసీపీ నాయకులు యథేచ్ఛగా సాగించిన భూఆక్రమణలు చేతికి అందివచ్చిన అవకాశంలా మారాయి. అధికారంలోకి వచ్చిందే తడవుగా వైసీపీ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా అనేకచోట్ల ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు భూముల ఆక్రమణలకు తెగపడ్డారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం, డీకేటీ భూములనైతే ప్రభుత్వ రికార్డుల్లో పేర్లు మార్చి తమ పరం చేసుకోవడం, ప్రైవేటు వ్యక్తులను బెదిరించి అయిన కాడికి వారి వద్ద కొనుగోలు చేయడం వంటి పనులతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో అభద్రతాభావాన్ని కల్పించారు. ఇదే అంశాన్ని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తన పోరాటానికి ఆయుధంగా మలుచుకున్నారు. పీలేరు పట్టణంతో పాటు, దానికి ఆనుకుని ఉన్న ఎర్రగుంటపల్లె, దొడ్డిపల్లె, గూడరేవుపల్లె, బోడుమల్లు వారిపల్లె, ముదుపులవేముల గ్రామ పంచాయతీలలో అధికార పార్టీకి చెందిన నాయకులు సుమారు రూ.400 కోట్లు విలువజేసే 600 ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని గూగుల్ మ్యాప్స్ వంటి సాంకేతిక ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర లోకాయుక్త, రాష్ట్ర హైకోర్టులో ఫిర్యాదు చేశారు. 2021లో కిశోర్ ప్రయత్నం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆయన అందించిన ఆధారాల కారణంగా ఒత్తిడి పెరగడంతో ఆక్రమణలపై విచారణకు అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ, అప్పటి మదనపల్లె సబ్-కలెక్టర్ జాహ్నవిని ఆదేశించారు. ఆమె పర్యవేక్షణలో ఆరుగురు తహసీల్దార్లతో కూడిన 60 మంది సభ్యుల బృందం సుమారు రెండు నెలలపాటు విచారణ జరిపింది. కిశోర్ కుమార్ రెడ్డి సేకరించిన ఆధారాలన్నీ నిజమేనని కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో కిశోర్‌కుమార్‌రెడ్డి నైతిక విజయం సాధించినట్లైంది. అప్పటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నిస్తేజంగా ఉన్న టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం మొదలైంది. కరోనా కారణంగా రెండేళ్లపాటు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకపోయినా పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటూ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆ ఉత్సాహం నీరుగారి పోకుండా చూసుకున్నారు.

'యువగళం'తో పీలేరులో పెరిగిన జోష్

2023 మార్చిలో పీలేరులో జరిగిన నారా లోకేశ్ 'యువగళం' పాతయాత్ర పీలేరు టీడీపీలో నవశకానికి నాంది పలికింది.

గత అభివృద్ధిని చూసి ఆదరించండి: నల్లారి

రాజకీయాలను, అధికారాన్ని స్వప్రయోజనాల కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసమే వెచ్చించాను. గత పదేళ్లుగా ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిచిన వారు అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. గత అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించాలంటే నన్ను ఆదరించండి. ప్రజలు ఈసారి మంచి నిర్ణయం తీసుకుని నన్ను గెలిపించండి.

ఒక్క అవకాశం ఇస్తే..

- పథకాలను అటకెక్కించి
- రైతు సంక్షేమాన్ని విస్మరించి..
- ఐదేళ్ల పాలనలో రైతన్నల నడ్డి విరిచిన జగన్



కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 12: జిల్లాలో చిన్న, సన్నకారు, మధ్య, పెద్ద తరహా రైతులు 4,88,672 మంది ఉన్నారు. వీరంతా వ్యవసాయపై ఆధార పడి జీవిస్తున్న వారే. ఇటీవల కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రతికూల పరిస్థితులతో అనేక కష్టాలను చవి చూశారు. ఆదుకోవాల్సిన జగన్ ఐదేళ్ల పాలనలో రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారు. అసలే కరువు జిల్లా. వర్షాలు కూడా అంతంత మాత్రమే. అరకొరగా పండిన వర్షాల ఆధారంగా చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర కలిగేంత వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నిల్వ ఉంచి దిగుబడులపై రుణం పొందే రైతుబంధు పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు పన్నుల వసూళ్లకే పరిమితం అయ్యాయి. సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీలో కూడా నిర్లక్ష్యం వహించారు.

> ముఖ్యమంత్రి జగన్ గత ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను వేడుకున్నారు. తాను అధికారంలోకి రాగానే రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటా... తన తండ్రి బాటలోనే పయనిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తానని ప్రగల్భాలు పలికారు. అధికారం దక్కాక అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారు. ఇక రైతులను కోలుకోలేని దెబ్బతీశారు.

కలగా మిగిలిన జలకళ

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020 సెప్టెంబరులో వైఎస్ఆర్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గ కేంద్రాల్లో రిగ్‌లు ఏర్పాటు చేసి తద్వారా సమీప మండలాల్లోని రైతులకు బోర్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీంతో వేలాది మంది చిన్న సన్న కారు రైతులు బోర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో బోర్లు తవ్వించేందుకు అనుమతిచ్చారు. అయితే రిగ్ వాహనాల యజమానులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పథకం మధ్యలోనే ఆగిపోయింది.

యంత్ర పరికరాలు ఏవీ..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న సన్నకారు రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను పంపిణీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పథకం ద్వారా పరికరాలు మొక్కుబడిగా అందజేస్తున్నారు. ప్రధానంగా పురుగుమందుల పిచికారి, చేతితో, కాలితో తొక్కే పవర్ తైవాన్ స్ప్రేయర్లను ఇవ్వాలంటూ రైతులు అభ్యర్థిస్తున్నప్పటికీ జగన్ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. వ్యవసాయ ఉత్పత్తుల ఆరబోతల కోసం టార్పలిన్ పట్టలు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులు పెట్టారు. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట దిగుబడులను రోడ్లపై ఆరబోసుకోవాల్సిన పరిస్థితి. రైతు రథం హార్వెస్టంగ్‌లాంటి పెద్దయంత్రాలను రైతు బృందాల పేరుతో ఈ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ అవి అధికార వైసీపీ నాయకులకే పరిమితం అయ్యాయి.

అలంకారప్రాయంగా ఆర్‌బీకేలు

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వ్యవసాయాన్ని మరింత చేరువ చేస్తున్నామంటూ గొప్పలు చెప్పి.. ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. విత్తు నుంచి పంట కొనుగోలు వరకు ఈ కేంద్రాల ద్వారానే నిర్వహిస్తామని బీకరాలు పలికి... అమలులో చిత్తశుద్ధి చూపించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో 836 రైతు భరోసాకేంద్రాలు ఉన్నాయి. ఒక్కో భవన నిర్మాణానికి దాదాపు 24 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఈకేంద్రాల ద్వారానే విత్తనాలు, ఎరువులు, రైతులకు పంపిణీ చేస్తామని చెబుతున్నప్పటికీ రైతు నచ్చి మెచ్చేటువంటి రకాలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు కాకుండా ప్రభుత్వానికి నచ్చినవి మాత్రమే రైతులకు అంటకట్టే పరిస్థితి ఏర్పడింది. ఇక పురుగు మందుల ఊసే లేదు. వీటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌ల పరిస్థితి అలాగే ఉంది. ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక అగ్రిల్యాబ్ నిర్మించారు. భవనాల నిర్మాణం, యంత్ర పరికరాలు సామగ్రి కొనుగోలు మౌలిక వసతుల కల్పనకు ఒక్కో కేంద్రానికి రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో రసాయనాలు ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో అగ్రి ల్యాబ్ లు నిరుపయోగంగా ఉన్నాయి.

మూసివేత దిశగా భూసార కేంద్రాలు

భూసార పరీక్షల కేంద్రాలకు జగన్ ప్రభుత్వ హయాంలో నిధుల గ్రహణం పట్టింది. గడిచిన మూడేళ్లకాలంలో వీటి నిర్వహణ కోసం అరకొరగా నిధులు ఇస్తున్నారు. దీంతో భూసార పరీక్ష కేంద్రాలు మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులోని భూసార పరీక్ష కేంద్రం మూతపడగా.. ఊటుకూరులోని సంచార వాహనానికి బ్రేకులు పడ్డాయి. ఇక యంత్ర పరకరాలు, రసాయనాల కొనుగోలు, పత్రాల ముద్రణకు నిధులులేక పరీక్షలను అంతంత మాత్రంగానే కొనసాగిస్తున్నారు.

కర్షకులకు తప్పని కరెంటు కష్టాలు

మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతాంగానికి అండగా ఉంటుంది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ పగటి పూట 9గంటలు ఇస్తామంటూ జగన్ గొప్పగా చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2.50 లక్షల కనెక్షన్లు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 7గంటలు ఇవ్వడం కూడా కష్టంగా ఉంది. అది కూడా పగలు 4 గంటలు, రాత్రి 3గంటల చొప్పున విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఒకరకంగా గాలి వీచినా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. కొత్తగా వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే వెంటనే సామగ్రి ఇవ్వడంలేదు. నెలల కొద్దీ నిరీక్షణ చేయాల్సి వస్తోంది. విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతన్నలకు సకాలంలో పరిహారం అందక వారి కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి.

కనిపించదా.. కరువు


సీఎం జగన్ తన సొంత జిల్లాలో ఏర్పడ్డ కరువు పరిస్థితులు కనిపించక పోవడం విచారకరమని రైతు సంఘాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కనీసం సాధారణ వర్షపాతం కూడా నమోదైన పరిస్థితులు లేవు. 2023-24 సంవత్సరాల్లో జిల్లాలో సాధారణ వర్షపాతం 637.6 మి.మీ నమోదు కావాల్సి ఉండగా కేవలం 429.3 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 32.7 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఖరీఫ్‌లో 77135 హెక్టర్లలో వివిధ రకాల పంటలు సాగు కావాల్సి ఉండగా 76,005 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అదేవిధంగా రబీలో 1,48,820 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా 1,32,857 హెక్టార్లలో పంటలు సాగుకు నోచుకున్నాయి. సరిపడా వానలు రాకపోవడంతో జిల్లాలో కరువు విలయతాండవం చేసింది. ఆదుకోవాల్సిన జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తిరిగి మరోసారి అవకాశం ఇవ్వాలంటూ రైతాంగాన్ని మభ్యపెట్టే విధంగా ముఖ్యమంత్రి జగన్‌తో పాటు ఆపార్టీ నేతలు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారు.

వైసీపీ దురాగతాలతోనే టీడీపీ వైపు ప్రజల మొగ్గు

- టీడీపీకే జనం జైకొడతారని ఆ పార్టీ నాయకుల ఆశాభావం
- పోలింగ్ కేంద్రాలపై పూర్తి స్థాయి దృష్టి
- టీడీపీ శ్రేణుల జోష్



రాజంపేట, మే 12: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు తనదేనని ధీమాగా ఉన్నారు. అధికార వైసీపీ చేసిన అరాచకాలు, ప్రజా వ్యతిరేకతే తమను గెలుపు ముంగిటకు తీసుకెళతాయని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులంతా ఏకతాటి పైకి వచ్చి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా భారీ ఎత్తున ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ దాదాపుగా వెళ్లి అధికార వైసీపీ చేసిన దురాగతాలను వివరించడంలో సఫలీకృతులయ్యారు. అధికార పార్టీ ఓటర్లకు భారీగా డబ్బులు పంపిణీ చేసినా ప్రజలు మాత్రం తమకే ఓట్లు వేస్తారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు మండలాలతో పాటు రాజంపేట మున్సిపాలిటీ ఉంది. ఇందులో 288 పోలింగ్ కేంద్రాలున్నాయి. రెండు రోజులుగా ప్రధాన పార్టీల నేతలు తమ బూత్ లెవల్ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రధానంగా అధికార వైసీపీ పార్టీ అధికమొత్తంలో ఓటర్లకు నగదు రూపేణా తాయిలాలు అందజేశారు. వైసీపీకి ధీటుగా టీడీపీ నేతలు పైసలు పంపిణీ చేయకపోయినా తాము ఖచ్చితంగా గెలుస్తామని అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని నోటుకు ఓటు పడదని, ఖచ్చితంగా గెలిచితీరుతామన్న నమ్మకంతో ఎన్నికలపై దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగించారని దోపిడీలు, దౌర్జన్యాలు చేశారని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ప్రధానంగా రాజంపేటలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేయలేదని, ఒక్క సిమెంటు రోడ్డు వేయలేదని రాజంపేట పట్టణంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని దాంతో పాటు రాజంపేట, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో ఏ చిన్నపాటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని టీడీపీ నేతలు ప్రజలకు వివరించారు.



సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోవడం ద్వారా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జిల్లా ప్రకటన చేయడం తమకు ఓట్ బ్యాంకు బాగా కలిసివస్తుందని టీడీపీ నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు. దాంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం, దానిని పునర్ నిర్మించకపోవడం, బాధితులకు న్యాయం చేయకపోవడం ముంపు బాధిత గ్రామాల్లో తమకు కలిసివస్తుందని టీడీపీ భావిస్తోంది. అదే విధంగా రాజంపేట నియోజకవర్గానికి మంజూరు చేసిన మెడికల్ కాళశాల ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా దానిని వైసీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. రైతుల్లో పెద్ద వ్యతిరేకత ఉందని, అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంత రైతులు టీడీపీకి ఓటు వేస్తారనుకుంటున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లో 22 వేల ఎకరాల ఆయకట్టు భూమి ప్రాజెక్టు తెగిపోవడం వల్ల బీళ్లుగా మారిందని, భూగర్భజలాలు అడుగంటాయని, తాగునీరు లేక అటు రాజంపేట మండల ఎగువ ప్రాంతంలో ఆ ప్రాజెక్టు రైతాంగమంతా టీడీపీకి ఓటు వేస్తుందనుకుంటున్నారు. సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో రాయచోటి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నప్పటికీ అరగంటలో అక్కడి చేరుకున్నప్పటికీ ఆ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్డీవో కార్యాలయాన్ని వారికి కేటాయించకుండా ఎంతో దూర ప్రాంతంగా ఎన్నో కొండలు, గుట్టలు ఏర్లు దాటి వెళ్లాల్సిన రాజంపేటకు ఆర్డీవో కేంద్రాన్ని కేటాయించడం పట్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని కావున ఆ రెండు మండలాల ప్రజలు టీడీపీకి మొగ్గు చూపుతారనుకుంటున్నారు.

టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు తన తండ్రి పాలకొండ్రాయుడు హయాం నుంచి సుండుపల్లె పెట్టని కోటని, అక్కడ బీసీలు ఎక్కువగా ఉన్నారని గత నియోజకవర్గాల పునర్విభజన కాక ముందు సుగవాసి అక్కడ ప్రాతినిధ్యం వహించడం వల్ల ఆ మండలం బాలసుబ్రమణ్యంకు పెట్టని కోటగా తయారవుతుందనుకుంటున్నారు. ఇక దానిని ఆనుకుని ఉన్న వీరబల్లి మండలానికి సుగవాసికి పెద్ద సంబంధాలు ఉన్నాయి. ఆ ప్రాంతం కూడా టీడీపీకి అనుకూలిస్తుందనుకుంటున్నారు. రాజంపేట మండలం అత్యధికంగా బీసీలు, ముస్లింలు అధికంగా ఉన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యం ఎక్కువ. రాజంపేట పట్టణం టీడీపీకి అనుకూలంగా ఉంది. రాజంపేట రూరల్ మండలంలో అనేక ప్రాంతాలు టీడీపీకి పెట్టని కోటలుగా ఉన్నాయి. కమ్మ, బలిజ, క్షత్రియ సామాజిక వర్గంతో పాటు రెడ్ల సామాజిక వర్గంలోని బలమైన నాయకులు టీడీపీ వైపు మొగ్గు చూపడం వల్ల రాజంపేట మండలం కూడా టీడీపీకి కలిసి రానుంది.

నందలూరు మండలంలో బాలసుబ్రమణ్యంకు సంబంధించిన సామాజికవర్గం ఆది నుంచి బలంగా ఉంది. దానికి తోడు బీసీలందరూ టీడీపీ వైపు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గమంతా బాలసుబ్రమణ్యంకు మద్దతు పలకారు. ఈ మండలంలో కూడా టీడీపీకి మెజార్టీ వస్తుందనుకుంటున్నారు. ఒంటిమిట్టలో నువ్వా నేనా అన్న విధంగా ఉన్నా రూ.130 కోట్లతో ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్టకు సోమశిల వెనుక జలాల నుంచి నీళ్లు అందించిన విషయం టీడీపీకి కలిసి వస్తుందనుకుంటున్నారు. సిద్దవటం మండలంలో మండల కేంద్రమైన సిద్దవటం టీడీపీకి పెట్టని కోట. అక్కడ కూడా వైసీపీలోని ఎమ్మెల్యే మేడా వర్గమంతా టీడీపీకి పనిచేస్తోంది. అందువల్ల ఆరు మండలాల్లో తప్పక మెజార్టీ సాధిస్తామని, అంతేకాక వైసీపీపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం గట్టి నమ్మకంతో తమ ఎన్నికల కేడర్‌ను అప్రమత్తం చేసి ఎన్నికలకు సిద్ధమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తమ కూటమి నేతల బలమే తన విజయానికి తోడ్పడతాయని ముందుకు సాగుతున్నారు.

సైకిల్ జోరుతో స్పీడు తగ్గిన ఫ్యాను

- రాయచోటిలో వైసీపీ కోటకు బీటలు
- రోడ్‌షోలు, చంద్రబాబు ప్రజాగళంతో జోష్‌లో టీడీపీ శ్రేణులు
- రాయచోటిలో పూర్వ వైభవం దిశగా టీడీపీ అడుగులు

రాయచోటిటౌన్, మే 12: ఇన్నేళ్లుగా వైసీపీ అభ్యర్థికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తూ వచ్చిన రాయచోటి ప్రజలకు... గడిచిన ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, భూదందాలతో విసుగుచెందారు. మట్టి, ఇసుక, మద్యం మాఫియాలతో, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీల పెంపుదలను చూసి చెత్త పన్ను, ఇంటి పన్ను ఇలా ఎన్నో రకాలుగా వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న బాదుడే బాదుడుతో భయభ్రాంతులకు గురయ్యారు. సామాన్య ప్రజలు రాబోయే ఎన్నికల్లో మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టోతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రాయచోటి నియోజకవర్గంలో సైకిల్ జోరు స్పీడ్ అందుకుంది. దీనికి తోడు ముక్కుసూటి మనిషి, మాట చెబితే ఎంత దూరమైనా మాట కోసం వెళ్లే మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి కుమారుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో టీడీపీ మరింత ఊపందుకుంది. అంతేగాక నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీకాంత్‌రెడ్డి అబద్ధాలతో, మాయలతో ప్రజలను మభ్యపెడుతూ కేవలం కొంత మందికే న్యాయం చేస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం మరిచారనే విమర్శలున్నాయి. ఆయనపై రాయచోటి పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలకు కూడా నమ్మకం సన్నగిల్లిందని చెబుతున్నారు. ఖచ్చితంగా ఈ సారి జరగబోయే ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇద్దామంటూ నియోజకవర్గ ఓటర్లు బాహాటంగా చెబుతుండడంతో టీడీపీ గెలుపు తథ్యమని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ టికెట్ కేటాయించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీకి పూర్వవైభవం సంతరించుకున్నట్లయింది. అంతేగాక అధిష్టానం పార్టీ టికెట్ కేటాయించినప్పటి నుంచి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అన్ని మండలాల నేతలను సమష్టిగా మద్దతు కూడగట్టారు. దీనికి తోడు ప్రచారంలో దూసుకుపోవడంతో టీడీపీ రోజు రోజుకు పుంజుకుంది. ఒకవైపు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నా మరోవైపు మండిపల్లి కుటుంబ సభ్యులు రాయచోటి పట్టణంతో పాటు సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండిపల్లికి ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ విజ్ఞప్తి చేస్తుండడంతో ఓటర్లు ఆలోచనలో పడ్డారు.

ఇదిలా ఉండగా గత నాలుగు దఫాలుగా వరుసగా ఎన్నికవుతూ వస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెంట నడిచిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరడంతో రాయచోటి పట్టణంలో వైసీపీ కోటకు బీటలు పడ్డాయని చెప్పడంలో సందేహం లేదు. ప్రధానంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ నసిబున్‌ఖానం, మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్ దంపతులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త కోడి శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్, 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డితో పాటు 24వ వార్డు కౌన్సిలర్ కూడా టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో పట్టణంలో టీడీపీకి మరింత బలం పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. అంతేగాక రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాయచోటి పట్టణంలో రోడ్‌షో నిర్వహించడంతో పాటు ఎన్నికల నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టడంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇదే సమయంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం రోడ్‌షోలో భాగంగా రాయచోటికి వచ్చి రోడ్‌షోలో మైనార్టీల సంక్షేమం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం పలు రకాల వాగ్దానాలు చేయడంతో టీడీపీ శ్రేణుల్లో మరింత జవసత్వాలు నింపినట్లయింది. మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట చెబితే మడమతిప్పడు అనే నినాదంతో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టడమే కాకుండా రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలనే కృతనిశ్చయంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. రాయచోటి వ్యాప్తంగా ఏ నోట విన్నా మండిపల్లి రాముడన్న అనే నినాదం వినిపిస్తుండడంతో నాలుగు సార్లు శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇచ్చాము. రాంప్రసాద్‌రెడ్డి కూడా ఒకసారి అవకాశం ఇద్దామనే విధంగా ఓటర్లలో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసీపీ కోటకు బీటలు పడనున్నాయని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇటు రాయచోటిలోనూ అటు రాష్ట్రంలోనూ టీడీపీ విజయ ఢంకా మోగిస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



ర్యాలీ సందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)



రాయచోటిలో రాయుడుకాలనీలో రాంప్రసాద్‌రెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్న ప్రజలు (ఫైల్)

పసిడిపురిలో మార్పు తప్పదు

పెద్దాయన వైపు ఓటర్ల మొగ్గు ● రాచమల్లుపై గూడు కట్టుకున్న వ్యతిరేకత

ప్రొద్దుటూరు సిద్ధం సభలో ఏ హామీ ఇవ్వని జగన్ ● రోడ్‌షోలో హామిలిచ్చిన బాబు

నేడు అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓటర్లు

ప్రొద్దుటూరు, మే 12: కడపజిల్లా రాజకీయాల్లో కీలక నియోజకవర్గాల్లో ఒకటి ప్రొద్దుటూరు. పదేళ్లగా వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్ రెడ్డిని గెలిపించిన ఓటర్లు ఈ సారి మార్పు తప్పదన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా అధికారంలో ఉండగా ఎమ్మెల్యే రాచమల్లు చెప్పిన హామీలేవి నేరవేర్చలేక పోయారు. ఐదేళ్లలో కేవలం రూ. 512 కోట్ల మేర నిధులు మంజూరు చేయించగలిగారు. స్వయంగా సీఎం జగన్ ప్రొద్దుటూరులో 13 పనులకు శిలాఫలకాలు వేసి శంకుస్థాపనలు చేశారు. అందులో ఏ ఒక్క పని పూర్తి కాలేదు. జరిగిన పనులకు పట్టుమని పదికోట్ల బిల్లులు కూడా మంజూరు కాలేదు. అంతేకాకుండా రెండుసెంట్ల స్థలంలో పేదలకు ఇళ్ళు నిర్మించి ఇస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రాచమల్లు రెండుసెంట్ల స్థలం లబ్ధిదారులకు ఇప్పించలేకపోయారు. ఆవాసాలకు పనికిరాని భూముల్లో సెంటు స్థలం పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి లబ్ధిదారు నుంచి మొదటి విడత రూ.35 వేలు, రెండో విడత రూ.35 వేల వంతున మొత్తం రూ.70 వేలు వసూలు చేశారు. కానీ మూడేళ్ల గడిచినా మూడు వందల ఇళ్ళులు కూడానిర్మించలేక పోయారు. దీంతో ప్రజల్లో ఆయన హామీల పట్ల నమ్మకం పోయింది. భూ ఇసుక దందా, క్రికెట్, మాట్కా, సెటిల్ మెంట్లు పోలీసు స్టేషను రెవెన్యూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెలమాముళ్లు పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి ఇసుక భూ దందాలు అక్రమ సంపాదనపై ప్రశ్నించిన టీడీపీ అధికార ప్రతినిధి బీసీ నేత నందం సుబ్బయ్యను పట్టపగలే వందలాది మంది చూస్తుండగా అతికిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య ప్రొద్దుటూరు ప్రజల్లో తీవ్ర భయోత్పాతాన్ని కలిగించింది. ఫలితంగా బీసీల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చింది. ఇందులో అసలు సూత్రదారులైన రాచమల్లు, బంగరురెడ్డి కమిషనర్ రాధ పేర్లు కేసులో పెట్టకుండా పోవడంతో వీరందరినీ చేర్చాలని సుబ్బయ్య భార్య అపరాజిత ఈ కేసును హైకోర్టులో నడుపుతోంది. సీబీఐ విచారణకు సైతం కోరుతోంది. ఈహత్యకు సీఎం జగన్ నుంచి సజ్జల అవినాష్ వరకు పోలీసులపై ఒత్తిడి పెట్టినట్టు ప్రచారం వుంది. ఈ హత్యతో రాచమల్లు బంగారురెడ్డి దౌర్జన్యాలు పెరిగిపోయాయి. చివరికి ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు మున్సిపల్ ఛైర్మెన్ పదవి ఇస్తామని చెప్పి మున్సిపల్ ఎన్నికలకు రూ.11 కోట్లు ఖర్చు చేయించి ఆఖరికి ఛైర్మెన్ పదవి ఇవ్వకుండా కుట్ర చేశారు. రమేష్ యాదవ్ బీసీ ఛైర్మెన్ కుర్చీలో కూర్చుంటే తన బావమరిది బంగారురెడ్డికి తనకు మున్సిపాలిటీలో పెత్తనం తగ్గుతుందని భావించి రమేష్ యాదవ్‌ను తప్పించారు. మహిళను ఛైర్‌పర్సన్ చేసి మున్సిపాలిటీలో రెండో వైస్‌ఛైర్మెన్‌గా వున్న బంగారురెడ్డిని అనధికార ఛైర్మన్‌గా పరిపాలన సాగించేలా కుట్రలు చేశారు. దీంతో బీసీల విషయంలో రాచమల్లుది బానిసగా చూసే వైఖరి అని ప్రచారం జరిగింది. మున్సిపాలిటీలో మెజారిటీ వుండే వైసీపీ కౌన్సిలర్లు కూడా ఎలాంటి అధికారాలు లేకపోవడం విలువ లేకపోవడంతో అసమ్మతి వర్గాలు ఏర్పడి కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మరికొందరు బయటికి వెళితే వారిని మళ్లీ బుజ్జగించి పార్టీలో పెట్టుకున్నారు. చివరికి ఎమ్మెల్యే రాచమల్లుకు అనుకూలంగా లేకుండా స్వతంత్రంగా వుండే వైసీపీ సర్పంచ్ శివచంద్రారెడ్డిని ముప్పుతిప్పలు పెట్టి వేధించాడు. దీంతో ఆయన పార్టీని వదిలి టీడీపీలో చేరారు. ఇప్పటికీ రాచమల్లు వెంట ఇష్టం లేకున్నా భయంతో కొందరు, ప్రలోభాలకు లొంగి మరికొందరు తిరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ అభ్యర్థిగా వైసీపీ అభ్యర్థికి బలమైన పోటీదారుడు ఎవరని ఆలోచించి టీడీపీ అధినేత ఐదు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన మేరునగధీరుడు, నిగర్వి అయిన నంద్యాల వరదరాజుల రెడ్డిని ఎంచుకున్నారు. దీంతో టిక్కెట్టు ఆశించిన వారిలో తీవ్ర అసంతృప్తులు ఏర్పాడ్డాయి. సురేష్ నాయుడు మాత్రం త్వరగా నిర్ణయం తీసుకుని వరదరాజుల రెడ్డికి మద్దతు పలికి ఆయన వర్గంలో వున్న వారందరినీ కలిసిపోయేలా చర్యలు తీసుకున్నారు తరువాత లింగారెడ్డి వరదరాజులరెడ్డికి మద్దతు పలికారు. ప్రవీణ్‌రెడ్డి మాత్రం పూర్తిగా ప్రచారాలకు దూరంగా వున్నారు.

రోడ్‌షోలో చంద్రబాబు హామీల జల్లు



జగన్ సిద్ధం సభతరువాత మూడు రోజులకు మార్చి 30 నాడు చంద్రబాబు రోడ్ షో ప్రొద్దుటూరు శివాలయం నడిబొడ్డున మిట్టమధ్యాహ్నం మండుటెండలో సాగింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు అబిమానులు చంద్రబాబు సభకు నియోజవర్గ వ్యాప్తంగా తరలివచ్చారు. ఈ సభలో చంద్రబాబు ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజిని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కుందూ పెన్నా అనుసంధాన కాల్వ పూర్తి చేయిస్తానన్నారు. ప్రొద్దుటూరు కార్పొరేషన్ చేసి రాయలసీమలోనే గొప్ప వాణిజ్య నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రొద్దుటూరులో అక్రమంగా భూములు లాక్కున్న వారి నుంచి తిరిగి భూములను ఇప్పిస్తామని మామీ ఇచ్చారు. ఇంకా అనేక కార్యక్రమాలు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజల్లో జోష్ పెరిగింది. ప్రొద్దుటూరులో పెద్దాయన వస్తే అరాచక పాలన అంతం అవుతుందనే ప్రధానంగా ప్రొద్దుటూరు ఓటర్లు 80 ఏళ్లు పైబడిన రాజకీయ కురువృద్ధుడైన పెద్దాయన వరదరాజులరెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా పలు సర్వేల్లో రాచమల్లుకు వరదరాజుల రెడ్డికి గట్టిపోటీ వుందని ప్రకటిస్తూనే పెద్దాయనకే విజయం వరిస్తుందని చెబుతున్నాయి. ఈ ఎన్నికల్లో రాచమల్లు వందకోట్లకు పైగా డబ్బు ఖర్చు చేస్తున్న ఓటర్లకు డబ్బు తాయిలాలు ఎర చూపుతున్నా ఆయనకు ఈ సారి ఓటమి తప్పదని సర్వేలు చెబుతున్నాయి. ఏది ఏమైనా నేడు జరిగే పోలింగ్‌లో తమ ఓటుతో ప్రొద్దుటూరులో అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు.

పెద్దాయన వైపే ఓటర్ల మొగ్గు

పదేళ్ల రాచమల్లు పాలన చూసిన ప్రొద్దుటూరు ప్రజలు ఈ సారి పెద్దాయన నంద్యాల వరద రాజులరెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారు. 25 ఏళ్లలో పెద్దాయన ఎమ్మెల్యేగా 10 ఏళ్లు అధికార పార్టీ ఇన్‌చార్జిగా మొత్తం 35 ఏళ్ళ పెద్దాయన పాలనలో ఇసుక, భూదందాలు లేవని వివిధ వర్గాల వారు అభిప్రాయ పడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్ మట్కా, జూదం ఈ స్థాయిలో ఎప్పుడూ లేదని బుకీలను ప్రొద్దుటూరు నుంచి బహిష్కరణ చేసిన ఘనత వరద రాజులరెడ్డిదేనని ప్రజల్లో అభిప్రాయం నెలకొంది. ప్రొద్దుటూరులో 1985 నాటి ప్యాక్షన్ రోజులను తలపించేలా రోడ్లపై, టీ బంకుల వద్ద రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి గురించి మాట్లాడుకోలేని భయం గుప్పిట్లో ప్రజలు బతికారు. వ్యాపారులు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు సాగించలేని పరిస్థితి వచ్చిందని భావించారు. దీంతో రాచమల్లు లాంటి అంగ, ఆర్థిక బలం వున్న బలమైన వ్యక్తిని ఓడించాలంటే ఒక్క వరదరాజులరెడ్డి సరేన అభ్యర్థి అని అన్ని సర్వేల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఆయన నాయకత్వం కోరుకున్నారు. చంద్రబాబు ఎలాంటి షరతులు లేకుండానే పెద్దాయనకు టికెట్టు కేటాయించి పార్టీని గెలిపించాలని ఆదేశించారు. దీంతో దూర దూరంగా ఉంటున్న పలువురిని దగ్గరికి పిలిచి బుజ్జగించి పార్టీ ప్రతి ఒక్కరికీ సరైన న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. దీంతో దూరమైన, అసంతృప్త లను వరద దగ్గరికి చేర్చుకున్నారు.

సిద్ధం సభలో ఏ హామీ ఇవ్వని జగన్



ప్రొద్దుటూరులో మార్చి 27న జరిగిన సిద్ధం సభలో వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరు అభివృద్ధి పై ఒక్క మాట గానీ ఒక్క పథకం గానీ హామీ ఇవ్వలేదు. కేవలం రాష్ట్రంలో తాను అమలు చేస్తున్న నవరత్నాలు గురించి ఊదర గొట్టాడు దీంతో ఈ సారి కనీసం ప్రొద్దుటూరుకు ఏమి చేస్తా మో ఇప్పటి వరకు చేపట్టిన పథకాలు ఏమయ్యా యి, నిధులు ఎందుకు విడుదల కాలేదో సమాధానం లేదు. దీంతో ప్రొద్దుటూరు ప్రజలు తీవ్ర నిరా శ చెందారు. రాచమల్లు కూడా ఆ సభలో ప్రజలకు ఏ ఒక్క కొత్త హామీలను ప్రకటించలేకపోయారు. దీంతో ప్రొద్దుటూరు ఓటర్లను జగన్ ఆకట్టుకోలే పోయారని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు. జిల్లా స్థాయిలో పెట్టిన సభకు లక్షమందికిపైగా జనం వస్తారని అంచనావేసుకున్న కేవలం 30 వేలమంది మాత్రమే రావడంతో వైసీపీ కొంత ఆలోచనలో పడిందని పలువురు ఆ పార్టీనేతలే బయట చర్చల్లో బహిర్గతం చేశారు.

సమర్థులకే ఓటు

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువత మనోగతం



కడప (ఎర్రముక్కపల్లె), మే 12: పాలకులు ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చేలా ఉండాలి. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. నాణ్యమైన విద్య వైద్యాన్ని ఉచితంగా ప్రజలకందించాలి. ఇవన్నీ చేయగల సమర్థత ఉన్న నేతలను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవితాల్లోనూ మార్పు సాధ్యమవుతుంది. మా ఓటు అటువంటి సమర్థుడైన నాయకుడికే అంటున్నారు తొలిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న పట్టభద్రులు, యువకులు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎందరో యువ ఓటర్లు కూడా ఇదే విధమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా వ్యవహరించే నేతను ఎన్నుకుంటే మేలు జరుగుతుందన్న భావన యువ ఓటర్లలో ఉంది. ఉచిత పథకాలకు ప్రాధాన్యతనివ్వకుండా ప్రజలు కష్టపడి సంపాదించుకునే మార్గాలను చూపించాలని వృత్తి, ఉపాధి కల్పన మార్గాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ఇప్పటికీ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందడంలేదని దీనిపై పాలకులు ఎందుకు దృష్టి సాఇరించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక దానికనుగుణమైన కార్యాచరణ ముఖ్యమని ఆ దిశగా పాలకులు ముందు చూపుతో వ్యవహరించాలని యువ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది గంటల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న యువతీ యువకుల మనోగతాన్ని తెలుసుకునేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించింది, వారి అభిప్రాయాలు ఇలా..


ఉపాధి కల్పించే వారికే ఓటు



దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ నిరుద్యోగసమస్యలు మాత్రం పట్టించుకోవడంలేదు. ఉద్యోగాలు దొరక్క ఈ విద్యా వ్యవస్థపై ప్రభుత్వాలు, పాలకులకు ముందు చూపులేకపోడం వల్లనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు ఎవరైనా ఉద్యోగాలు కల్పించేలా ఉండాలి. కొత్త పరిశ్రమలు తీసుకురావాలి. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలి. అటువంటి ఆలోచన చేసే ప్రభుత్వాలకే ఓటు వేస్తాం. ఇప్పటికే ఆ దిశగా నిర్ణయం తీసుకున్నాం. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రతి ఒక్కరిదీ ఇదే మాట.

గణేశ్, పెండ్లిమర్రి


ఉద్యోగావకాశాలు కల్పించినవారికే



ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత చదువుకునే యువతను నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులకు ముందు చూపు లేకపోవడం వల్ల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకఉండాపోతున్నాయి. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలి. కొన్ని గంటల్లో జరగబోయే ఎన్నికల్లో నా మొదటి ఓటు ఆలోచించి వేస్తా.

గంగాధర్, ఐటీఐ, విద్యార్థి, పెండ్లిమర్రి

సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి



నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్లేలా పాలకుల ఆలోచన ఉండాలి. అప్పుడే మెరుగైన సమాజాన్ని స్థాపించేందుకు అవకాశం ఉంటుంది. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను మేనిఫెస్టోలో పెట్టాలి. యువతకు మేలు చేసేవారిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఉచిత విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించే పాలకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకుంటాను.

ఎ.సునీల్, డిగ్రీ ఫస్టియర్, ఎర్రగుంట్ల

అభివృద్ధికి ప్రాధాన్యతివ్వాలి



నిరుపేదలు ఉన్నత చదువులు చదివేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పీజీ ప్రైవేటు కళాశాల్లో చేయడానికి ఫీజురీయింబర్స్‌మెంటు ఇవ్వడంలేదు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చే ప్రభుత్వానికి ఓటు వేస్తాను. నిరుపేదలకు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఉచితాలకు కాకుండా అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వాలి. రాష్ట్రం ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు చేయాలి. అప్పు చేసి పథకాలు అమలు చేసే విధానానికి పాలకులు దూరంగా ఉండాలి. అటువంటి నేతలకు మాత్రమే ఓటు వేస్తాం.

గణేశ్, డిగ్రీఫస్టియర్, కడప

అవినీతి రహిత పాలకులకే ఓటు



అవినీతిరహిత పాలన అందించే పాలకులను ఎన్నుకోవాలి. ఇప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇస్తేనే కానీ పనులు జరగడంలేదు. ఇటువంటి వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడంలేదు. అవినీతికి ఆస్కారం లేని ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు నేను సిద్దంగా ఉన్నాను. అటువంటి మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు తొలి ఓటును వినియోగించుకుంటాను. బంధువులు చెప్పారనో కుటుంబ సభ్యులు వత్తిడి చేశారనో బలవంతంగా ఎవరికీ ఓటు వేయకూడదు. నా మనసుకు నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తాను.

పి.వేణు, బీఎస్సీ ఎంఎల్‌టీ సెకండియర్, కడప

టీడీపీలో నయాజోష్

వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు / ఉత్సాహంలో టీడీపీ శ్రేణులు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 12: కమలాపురం నియోజకవర్గం టీడీపీలో నూతనోత్సాహం నింపుకొంది. నాలుగు దఫాలుగా ఓటమిని చవి చూసిన కమలాపురం నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఈ ఎన్నికల్లో నూతన ఉత్సాహంతో గెలుపు దిశగా కృషి చేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ టికెట్ యువతకు కేటాయించడంతో పుత్తా నరసింహారెడ్డి తన కుమారుడిని టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దింపారు. ఈ క్రమంలో ప్రచారం జరిగినన్ని రోజులు పుత్తా కుటుంబీకులు రోజూ జనాల్లోనే ఉంటూ టీడీపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. గ్రామల్లో సైతం వారికి టీడీపీ శ్రేణులు, స్థానికులు కూడా ఘనంగా స్వాగతం పలికి ఆదరించారు. ఈ రోజు జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి గెలుపు కోసం సిద్ధమంటున్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి నేటితో చరమగీతం పాడనున్నారు. వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు చాపకింద నీరులా విస్తరించాయి. ఈ అంశం టీడీపీకి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు విజయావకాశాలను దక్కించేలా ఉన్నాయి. చాలా మండలాల్లో ఆధిపత్య పోరు ఆ పార్టీలో కొనసాగుతోంది. మండల కేంద్రమైన వల్లూరులో స్థానిక సర్పంచ్ కుటుంబీకులదే కొన్నేళ్లగా ఆధిపత్యం ఉండేది. అయితే ఈ ఎన్నికల్లో కేవలం కొన్ని గ్రామాలు మాత్రమే ఆ కుటుంబానికి అప్పగించారు. ఒకే పంచాయతీలోని మరిన్ని గ్రామాల్లో మరొకరికి అవకాశం ఇవ్వడంతో విబేధాలు తలెత్తుతున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో పలు సందర్భాల్లో కమలాపురం నియోజకవర్గం సమన్వయకర్త ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డికి, స్థానిక ఎమ్మెల్యేకు అంతర్గత విబేధాలు ఉండేవి. ఈ తరుణంలోనే నియోజకవర్గ స్థాయిలో వైసీపీ నేతలు కూడా వర్గాలు విడిపోయిన పరిస్థితులుండేవి. ఒకానొక సందర్భంలో చెరువుల్లో మట్టి తీసే అంశం, నదుల్లో ఇసుక తోడే అంశాలపై కూడా వీరికి కొంత వరకు విబేధాలు ఉండడంతో అదేపార్టీ వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం కేసులు పెట్టుకునే స్థాయికి వెళ్లింది. టీడీపీ మరింత బలాన్ని సమకూర్చుకుంది. టిక్కెట్ యువతకు కేటాయించడంతో వారు ఉత్సాహంగా గెలుపుదిగా పనిచేస్తున్నారు.

పులివెందుల వైసీపీలో నైరాశ్యం

● షర్మిల పోటీతో అంతర్మథనంలో వైసీపీ

● వైఎస్ విజయలక్ష్మి వీడియోతో మరింత కుంగిన వైసీపీ శ్రేణులు





తల్లితో వైఎస్ షర్మిల (ఫైల్ ఫొటో)

కడప, మే 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల వైసీపీ శ్రేణుల్లో రోజురోజుకూ నిరుత్సాహం, నైరాశ్యం పెరిగిపోతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గతంలో వచ్చిన మెజార్టీ తగ్గుతుందా అనే అనుమానం వైసీపీని వేధిస్తోంది. ఇందుకు టీడీపీ పక్కా వ్యూహంతో పావులు కదపడం ఒక ఎత్తయితే.. వివేకా హత్యే ప్రధాన అస్త్రంగా షర్మిల బరిలోకి దిగడం మరో కారణం. ఈ పర్యాయం తన ఉనికిని చాటుకోవాలని బీటెక్ రవి సర్వశక్తులు ఒడ్డి ప్రచారాన్ని సాగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ ఓటర్లకు డబ్బు పంపిణీ సాగించింది. గతంలో టీడీపీ నేతలు అదో డబ్బు ఇస్తాం, ఇదో డబ్బులిస్తామని ఆశచూపి చివరకు వందో రెండు వందలో చేతిలో పెట్టి మిగిలిన డబ్బు జేబులో సర్దుకుని చేతులు దులుపుకొనేవారనే విమర్శలు ఉన్నాయి. కానీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈ పర్యాయం ఓటర్లకు ప్రతి చోటా సక్రమంగా డబ్బు పంపిణీ సాగించడంలో సఫలీకృతమయ్యారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం వస్తే పులివెందుల టీడీపీ నేతలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బీటెక్ రవి నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇస్తూ వచ్చారు. ఈ ప్రభావం జగన్ మెజారిటీపైన పడే అవకాశాలు స్పష్టంగా తెలుస్తోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థులకు వచ్చిన ఓటింగ్ కంటే తనకు పైపెచ్చుగా రావాలనే లక్ష్యంతో టీడీపీ పావులు కదిపింది. ఈ కారణాలతో గతంలో వచ్చిన జగన్ మెజారిటీపై అనుమానాలు సన్నగిల్లుతున్నాయి.

డోలాయమానంలో అవినాశ్‌రెడ్డి పరిస్థితి

షర్మిల కడప ఎంపీ బరిలో ఉండడంతో అవినాశ్‌రెడ్డి పరిస్థితి ఏమిటని ఆ వర్గ నాయకులు, వర్గాల్లో అంతర్మథనం మొదలైంది. పులివెందులలో గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ అవినాశ్‌కు రాకపోతే ఎంపీ స్థానం వదులుకోవాల్సిందేనని అక్కడి పార్టీ విశ్లేషకులు అంటున్నారు. వైఎస్ బిడ్డ షర్మిల బరిలో నిలవడంతో మునుపటి మెజారీటి అవినాశ్ అందుకునే పరిస్థితి కనిపించడం లేదు. పులివెందుల సహా ఎంపీ సెగ్మెంట్ పరిధిలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉండడం అవినాశ్‌రెడ్డి వర్గానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పులివెందులలో ఆదినుంచి వైఎస్ కుటుంబానికి, అవినాశ్ రెడ్డి కుటుంబానికి మధ్య దూరం ఉంటూ వచ్చింది. వైఎస్ ఉన్నన్ని రోజులు అవినాశ్ కుటుంబాన్ని దూరం పెడుతూ వచ్చారు. దీంతో ఆ నియోజకవర్గంలో కేవలం రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి కుటుంబాలపైనే ప్రజలకు అభిమానం ఉండేది. ఇపుడు వైఎస్ కూతురు షర్మిల, వివేకా కూతురు సునీత ప్రచారంలో దూసుకుపోయారు. వివేకా హత్యే ప్రధాన అస్త్రంగా వీరిద్దరూ ప్రచారాలు సాగించారు. రాత్రిళ్లు షర్మిల, సునీత ప్రసంగాలు కలలో కూడా వస్తున్నాయని వైసీపీలో చాలా మంది నేతలకు అంటుండడంతో అక్కడ పరిస్థితి ఎలాఉందో ఇట్టే అర్థమవుతోంది. కడప ఎంపీగా బరిలో నిలిచిన షర్మిల మీ వైఎస్ బిడ్డ, మీ రాజన్న బిడ్డ అని మైకు పట్టుకుని మాట్లాడుతుంటే.. కొంగుచాచి ఓటర్లను అభ్యర్థిస్తుంటే ఇక అవినాశ్ పని అయిపోయినట్లేనని ఆ వర్గ నాయకులే చర్చించుకుంటున్నట్లు తెలిసింది. చివరి అస్త్రంగా షర్మిల శిబిరం వైఎస్ సతీమణి వైఎస్ విజయలక్ష్మి వీడియోను విడుదల చేసింది. తన భర్త వైఎస్‌ను కడప పార్లమెంట్ పరిధిలో ఎలా అక్కున చేర్చుకున్నారో అదేవిధంగా తన బిడ్డ షర్మిలను అక్కున చేర్చుకుని ఆదరించాలంటూ వైఎస్ విజయలక్ష్మి పిలుపునివ్వడం అవినాశ్ శిబిరంలో దుమారం రేపుతోంది. దీంతో పులివెందుల నియోజకవర్గంలో తన ఓటింగ్ శాతం తగ్గితే ఇబ్బంది అవుతుందనే అవినాశ్‌రెడ్డి వర్గం ఓటుకు రెండువేలు ఇచ్చినప్పటికి మరోమారు రూ.1000, రూ.2000 పంపిణీ సాగించింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలు వద్దంటున్నా గోడ గడియారాలు, చీరలు ఇచ్చారు. ఒకపక్క అవినాశ్‌రెడ్డి గెలుపునకు ఢోకా లేదు అంటూనే మరోపక్క ఏమవుతుందోననే ఆందోళన వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

టీడీపీలో జోష్

వైసీపీలో నైరాశ్యం ? ● షర్మిలకు క్రాస్ ఓటింగ్ ? ● నేడు పోలింగ్



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ యాదవ్



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల



వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డి

మైదుకూరు, మే 12: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం జరగనున్న పోలింగ్‌లో టీడీపీ జోష్ కనబడుతుండగా అధికార పార్టీ వైసీపీలో కాస్తంత నైరాశ్యం కనబడుతున్నట్లు రాజకీయ వర్గాల విశ్లేషణ. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచీ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఉత్సాహంగా నియోజకవర్గం మొత్తం కలియతిరుగుతూ అధికార పార్టీలోని వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్, సర్పంచ్, ఏకంగా మాజీ జడ్పీటీసీ సహా పార్టీలో కీలక పదవులున్న నేతలను సైతం టీడీపీ వైపు మొగ్గు చూపేలా చేసి వేలాదిమంది కుటుంబాలకు టీడీపీలోకి ఆహ్వానం పలికారు. ఓ వైపు వైసీపీ నేతల చేరికలు మరో వైపు టీడీపీ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అంశాలపై ఇంటింటికీ తిరుగుతూ చేసిన ప్రచారంలో ఉత్సాహం పెంపొందించారు. నియోజకవర్గంలో ఎక్కడ రోడ్‌షో పెట్టినా వేలాది మంది కార్యకర్తలు పాల్గొంటూ ఉండడంతో, ప్రచారానికి అధినాయకులు రాకపోయిన టీడీపీ జోష్ కనబడుతోంది. కాగా అధికార పార్టీ వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై వ్యతిరేకత కనపడుతోంది. వైసీపీలో ఉన్న దాదాపు నాయకులందరూ టీడీపీలో చేరడం, నియోజకవర్గంలో కేవలం ప్రభుత్వ పథకాలు తప్పితే ఆయన చెప్పుకోదగ్గ ఎటువంటి అభివృద్ధి పనులూ కనబడక పోవడంతో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం కనబడుతోందని సమాచారం. దీంతో ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సభ మైదుకూరులో పెట్టి, ప్రభుత్వ పథకాలు మాత్రమే వివరించి ముగింపు పలుకబోయారు. దీంతో ఎంపీ అవినాష్‌రెడ్డి ఓ కాగితం ముక్కను సీఎం జగన్ చేతికి ఇవ్వగా దాన్ని చూసి, అప్పుడు ఇచ్చిన హామీ రాజోలి రిజర్వాయర్ నిర్మించలేక పోయానని, మళ్లీ ఈ దఫా ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే నిర్మాణం చేపడతానంటూ మళ్లీ ఉత్తుత్తి హామీని ఇచ్చి వెళ్లినా ఆయన మాటలను నియోజకవర్గ ప్రజలు నమ్ముతారన్నా గ్యారెంటీ కనపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల సహా వివేకా కుతురు డాక్టర్ సునీత మైదుకూరుకు రెండు సార్లు పర్యటించి, జగన్ దుర్మార్గపు చర్యలు, మోసాలు, దోపిడీలు ప్రజలకు వివరించారు. ఆయనకు ఓట్లేస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీ వివేకానందరెడ్డి ఆత్మ ఘోషిస్తుదంటూ ఓటర్లకు వివరించారు. దీంతో ఓటర్లు డైలమాలో పడి టీడీపీ వైపే మొగ్గు చూపుతూ క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏదీ ఏమైనా నియోజకవర్గంలో టీడీపీలో జోష్‌లో కనబడుతుండగా, అధికార పార్టీ వైసీపీలో నైరాశ్యం కనబడుతోందని ఓటర్లు బహిరంగాంగానే చర్చించుకుంటున్నారు.

నిలువ నీడేది జగన్ ?

● షెల్టర్లు ఎప్పుడు కడతారో కాలజ్ఞానికే ఎరుక

మైదుకూరు, మే12: ప్రపంచంలో ఏదీ ఎప్పుడు ఎక్కడ ఎలా జరుగుందో తెలియజేసిన కాలజ్ఞానవేత్త పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి. ఆ పవిత్ర పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా బస్సు షెల్టర్ లేదు. చారిత్రక, దర్శనీయ స్థలంగా పేరుపొందిన బ్రహ్మంగారిమఠంకు రెండు తెలుగు రాష్ట్రాలు కర్నాటక, తమిళనాడు కాకుండా ఇతర దేశాల నుంచి అనేక మంది భక్తులు వస్తుపోతుంటారు. బ్రహ్మంగారు కులాలను రూపుమాపి సమసమాజ నిర్మాణానికి కృషి చేసిన ఈ క్షేత్రంలో ప్రయాణికులు, భక్తులు బస్సుల కోసం వీధుల్లో నిలబడాల్సివస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పదేళ్లగా చెబుతూ సీఎం జగన్ దృష్టికి తీసుకుపోయినట్లు బహిరంగంగా చెప్పినా ఇంత వరకు కనీసం ఆ దశగా అమలుకు నోచుకోలేదు. ఎండవాన పగలు రాత్రి అనక భక్తులు, ప్రయణికులు నడిరోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తుండిపోతున్నారు. బ్రహ్మంగారిమఠం ఆలయానికి ఏటా జరిగే ఆరాధన ఉత్సవాల్లో కనీసం 3 లక్షల మంది భక్తులు పాల్గొంటారు. ఆలయానికి భక్తుల నుంచి హుండీ ద్వారా వచ్చే ఆదాయం ఏడాడికి దాదాపు 4నుంచి 5 కోట్ల వరకు వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ విఫలమవుతున్నారు. భక్తులు నిలబడేందుకు కనీసం షల్టర్ కూడాలేక పోవడం గమనార్హం. మఠం కూడలిలో అతి పురాతంగా ఓ షెల్టర్ ఉండేది. బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే స్థానిక నేతలతో కలసి షల్టర్‌ను కూల్చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఆ ప్రాంతంలో ప్రయాణికులు నిలబడేందుకు కనీసం నీడనిచ్చే ఇనుప రేకులు కూడా వెయ్యలేదు. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- మదనపల్లెలో 2,66,590 మంది ఓటర్లు
- 250 పోలింగ్ కేంద్రాలు
- మదనపల్లెలో 46 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 2308 మంది పోలింగ్ సిబ్బంది
- మదనపల్లెలో 161 చోట్ల వెబ్‌క్యాస్టింగ్

- తంబళ్లపల్లెలో 2,24,124 మంది ఓటర్లు
- 236 పోలింగ్ కేంద్రాలు
- తంబళ్లపల్లెలో 60 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 1704 మంది పోలింగ్ సిబ్బంది
- తంబళ్లపల్లెలోని అన్ని కేంద్రాలో వెబ్‌క్యాస్టింగ్

- పీలేరులో 2,34,608 మంది ఓటర్లు
- 281 పోలింగ్ కేంద్రాలు
- పీలేరులో 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 1862 మంది పోలింగ్ సిబ్బంది
- పీలేరు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

మదనపల్లె టౌన్, మే 12: మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో సోమవారం జరుగనున్న పోలింగ్‌నకు అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో మొత్తం 2,66,590ఓట్లు ఉండగా వారిలో అత్యధికంగా మహిళా ఓటర్లు 1,36,078 ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,31,460 ఓటర్లు ఉండగా ఇతరులు(ట్రాన్స్‌జెండర్లు) 51 మంది ఓటర్లు ఉన్నారు. మదనపల్లె నియోజవకర్గంలో మదనపల్లె మున్సిపాలిటీతో పాటు మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 259 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు, విద్యుత్‌సరఫరా, బ్యారికేడ్లు, ఓటర్ల నీడకల్పించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. 259 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు 312 మంది ప్రిసైడింగ్ అధికారులు, 312 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1248 మంది ఓపీవోలు, 54 మంది మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నారు. అలాగే పోలింగ్ సరళిని వీడియో చిత్రీకరించేందుకు 19 మంది వీడియోగ్రాఫర్లను నియమించారు. దీంతో పాటు 259 పోలింగ్ కేంద్రాలను 38 సెక్టార్లుగా విభజించి, 38 రూట్లలో 38 మంది సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం కలిపి 2308 మంది అధికారులు పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో 161 పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. అలాగే 46 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలను నియమించారు. ఇకపోతే స్థానిక జడ్పీ హైస్కూల్లో రిజర్వుడుగా 32 మంది ప్రిసైండింగ్ అధికారులు, 32 మంది ఏపీవోలు, 132 మంది ఓపీవోలు, ఆరుగురు మైక్రో అబ్జర్వర్లు అందుబాటులో ఉంచారు. విధి నిర్వహణలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే వారి స్థానంలో రిజర్వుడు అధికారులు వెళ్లి బాధ్యతలు చేపడతారు. కాగా మదనపల్లె జడ్పీహైస్కూల్ నుంచి 38 బస్సుల్లో పోలింగ్ అధికారులు వారికి కేటాయించిన ఈవీఎంలు, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్, పోలింగ్ బూత్ పెట్టెలు తీసుకెళ్లారు. మదనపల్లె అసెంబ్లీ(164 ఏపీఎల్‌ఏ) నియోజకవర్గంతో పాటు రాజంపేట పార్లమెంట్(24 హెచ్‌వోపీ) నియోజకవర్గం పరిధిలో ఓట్ల పండుగకు రిటర్నింగ్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం స్థానిక జడ్పీహైస్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీప్యాట్ మిషన్లను పంపిణీ చేశారు. దీంతో పాటు పోలింగ్‌కు అవసరమైన పెన్నులు, పేపర్లు, సిరా తదితర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు ఏఆర్‌వోలు, 38 మంది సెక్టోరియల్ అధికారులు పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సోమవారం ఉదయం 5.30గంటలకే పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. 50 ఓట్లను వేసి, వాటిని లెక్కించి, వీవీ ప్యాట్‌లో చీటిలు 50 వచ్చాయా..? లేదా సరిచూసుకోవాలన్నారు. అనంతరం ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలకు సీల్ వేసి ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత సమయానికి పోలింగ్ ప్రారంభించి, గంట గంటకు ప్రిసైడింగ్ అధికారుల మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న పీడీఎంఎస్ యాప్‌లో పోలింగ్ వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సెక్టోరియల్ అధికారులకు తెలిపి, వారి వద్ద రిజర్వులో వున్న ఈవీఎంలను మొరాయించిన ఈవీఎం స్థానంలో మార్చి పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి సూచించారు.

తంబళ్లపల్లెలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

ములకలచెరువు/తంబళ్లపల్లె/కురబలకోట,మే12:తంబళ్లపల్లె నియోజకవర్గంలో సోమవారం పోలింగ్‌నకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. కురబలకోట మండలం అంగళ్ళు మిట్స్ కళాశాల నుంచి ఈవీఎంలు, పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మిట్స్ కళాశాలలో ఉన్నతాధిరులు పోలింగ్ అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో మొత్తం 236 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల సంఘం నియోజకవర్గం సమస్యాత్మకంగా గుర్తించడంతో అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నడుమ పోలింగ్ జరప నున్నారు. అలాగే కేంద్ర బలగాలు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించనున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో మొత్తం 2,24,124 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,10,308 మంది పురుషులు, 1,13,804 మంది మహిళలు, 12 మంది ట్రాన్స్ జండర్లు ఉన్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మండల స్థాయి అధికారులు, సిబ్బంది బ్యారికేడ్లు, తాగునీటి వసతి, లైట్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగ నుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఆఫీసర్లు 284, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 284, ఓపీవోలు 1136 మంది మైక్రో అబ్జర్వర్లు 70 మంది విధులు నిర్వర్తిస్తారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌వో రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం కురబలకోట మండలం మిట్స్ కళాశాల(స్ట్రాంగ్ రూం) నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 236 పోలింగ్ కేంద్రాలకు పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ఈవీఎంలు, వీవీప్యాడ్లు ఇతర ఎన్నికల సామాగ్రిని ఎన్నికల సిబ్బంది ద్వారా తరలించారు. నియోజకవర్గంలోని 37 సెక్టార్లలో సుమారు 3 వేల మందికి పైగా పీవో, ఏపీవో, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందితో పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ ఛైర్స్‌తో పాటు బీఎల్వో, వీఆర్‌ఏలను వారికి సహాయకులుగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మాక్ పోలింగ్ అనంతరం ఓటింగ్ పక్రియ మొదలవు తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కురబలకోట మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రిని స్ట్రాంగ్ రూముల నుంచి తెప్పించి ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. వీటిని సంబంధించి కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ కవిత తనిఖీ చేశారు. కాగా ఆర్వో రాఘవేంద్ర డీపీవో ధనలక్ష్మిలు సిబ్బందికి విధులను కేటాయించారు. కాగా తంబళ్ళపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఎన్నికల అధికారులు ఎంపిక చేయడంతో వెబ్‌కాస్టింగ్ నిఘా నీడలో నిర్వహించనున్నారు.

ఓట్ల పండుగకు సర్వం సిద్ధం

పీలేరు, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో కీలక అంకమైన పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో ఆదివారం ఉదయం నుంచి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షణలో సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్ మెషీన్లతోపాటు ఇతర స్టేషనరీ సామాగ్రిని ఆయన పోలింగ్ బూత్‌ల వారీగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విధులకు హాజరైన ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం రాత్రికే చేరుకుని అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుని సోమవారం ఉదయం 5.30 గంటలకే పోలింగ్‌కు సమాయత్తం కావాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది తవకు కేటాయించిన వాహనాల్లో సామగ్రితో తరలి వెళ్లారు. మదనపల్లె మార్గంలోని ఓ ఫంక్షన్ హాలులో ఎన్నికల విధులకు హాజరైన స్థానిక సిబ్బంది, కేంద్ర బలగాలు, తమిళనాడు రాష్ట్ర పోలీసులతో జిల్లా ఎస్పీ కృష్ణారావు సమీక్షించారు. పీలేరు నియోజకవర్గమంతటా చిన్న అలజడి కూడా లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పాటుపడాలని, ఎక్కడ ఏ చిన్న అపశృతి దొర్లినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింట్ ఉంటుందని, పోలింగ్ బూత్‌లలో ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే ఉన్నతాధికారులు తెలిసిపోతుందన్నారు. పోలింగ్ బూత్‌లలో ఎక్కడ ఏ చిన్న అల్లరి జరిగినా క్షణాల్లో స్పందించే విధంగా రూట్‌మ్యాప్ తయారు చేశామన్నారు. పోలింగ్ ముగిసిన



మదనపల్లె జడ్పీహైస్కూల్లో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్

తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలు అందే వరకు పోలింగ్ కేంద్రాలు విడిచిపెట్టి రావొద్దని ఆయన సిబ్బందిని ఆదేశించారు. పీలేరు నియోజకవర్గంలో 2,34,608 మంది ఓటర్లు ఉండగా పురుషులు 114962, మహిళలు 119624 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు 5614 మంది ఉండగా ప్రత్యేక ప్రతిభావంతులు 3449 మంది ఉన్నారు. 85 ఏళ్ల పైబడిన వారు 1698 మంది ఉన్నారు. 281పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించి అందుకు తగిన ఏర్పాటు చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఈఆర్‌వో రమ, ఏఈఆర్‌వో మహబూబ్ బాషా, ఏఎస్‌వో రామ్మోహన్, డీఎస్పీ రామచంద్ర రావు, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్, సీఐ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండలో:ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోనేలా పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్దం చేశారు. గుర్రంకొండ మండలంలో 43 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేశారు. అయా కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వేసేలా ఏర్పాట్లు చేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా 16గ్రామ పంచాయతీలకు గాను 49పోలింగ్ కేంద్రాలలో సోమవారం పోలింగ్ ప్రక్రియ జరగనుంది. మండలంలోని 20సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారులు దృష్టి సారించారు. స్థానిక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖతిజున్‌కుబ్రా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక సీఐ శేఖర్ మాట్లాడుతూ మండలంలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు 4,పోలీసు సిబ్బంది 150 తో పర్యవేక్షిస్తారన్నారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల దాకా 144సెక్షన్ అమలులో ఉంటుందని, ఎక్కడా నలుగురి కన్నా ఎక్కువగా గుంపులుగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోలింగ్ ముగిసే దాకా మండలం వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. వెబ్‌క్యాస్టింగ్ ఉన్న నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

కలికిరిలో: కలికిరి మండలంలో సోమవారం పోలింగ్ కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి. పీలేరు నియోజవర్గం మొత్తం సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రకటించడంతో ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లను నియమించారు. వారితోపాటు స్థానిక పోలీసులు ఇద్దరిని ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది కూడా అన్ని కేంద్రాలకు చేరుకున్నారు. ఇక పోలింగ్ బూత్‌లల్లో వెబ్ క్యాస్టింగ్ కోసం కెమెరాలను కూడా సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 48 పోలింగ్ బూత్‌లున్నాయి. మొత్తం 19,767 పురుషులు, 20,911 మహిళా ఓటర్లున్నారు. ఇతర ఓటర్లతో కలిపి మొత్తం 40,686 ఓట్లున్నాయి. ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుంది.

నిమ్మనపల్లిలో: మండలంలో సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏఆర్‌వో బాలాజిరాజు తెలిపారు. మండలంలో 10పంచాయతీలకు గాను మొత్తం ఓటర్లు 26069మంది ఉండగా వారిలో 12813 మంది పురుషులు, 13254 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జండర్‌లు ఉన్నారన్నారు. ఇందుకు గాను24 బూత్‌లు ఏర్పాటు చేశామని వాటికి సంభందించి 24మంది బూత్‌లెవల్ ఆఫీసర్‌లు, నలుగురు సూపర్‌వైజర్‌లు, నలుగురుసెక్టోరియల్ ఆఫీసర్‌లు ఉన్నారన్నారు. మొత్తం 156 ఎన్నికల సిబ్బంది విధులలో చేరినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను బట్టి ప్రతి పోలింగ్ వద్ద షామియానాలు ఏర్పాటు చేశామన్నారు. దీనితో ఫ్లయింగ్‌స్క్వాడ్, కేంద్ర బలగాలు విధులలో ఉన్నట్లు తెలిపారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌నకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 27,691 ఓటర్లు ఉండగా 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కెమోరాలను అమర్చినట్లు తెలిపారు. మదనపల్లి డీఎస్పీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, కేంద్రబలగాలు తదితర శాఖల సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతుందన్నారు.



మదనపల్లె జడ్పీ హైస్కూల్ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న పోలింగ్ అధికారులు



పీలేరులో ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులు



పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న ఉద్యోగులు



కురబలకోట: తంబళ్లపల్లె కేంద్రంలో ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులు



ములకలచెరువు:పోలింగ్ సిబ్బంది కోసం సిద్ధంగా ఉన్న బస్సులు



కలకిరి పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరా



గుర్రంకొండలో పోలింగ్‌కు సిద్దంగా ఉన్న కేంద్రాలు



పీలేరులో ఎన్నికల సిబ్బంది కోసం సిద్ధంగా ఉన్న వాహనాలు



తంబళ్లపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం

ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

పీలేరు, మే 12: ఆది శంకరాచార్యుల జయంతిని ఆదివారం పీలేరులోని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌లోని బ్రాహ్మణ సంఘ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, మహిళలు లలితా సహస్రనామావళి నిర్వహించారు. అనంతరం ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు ఉద్యా ఫణీంద్ర శర్మ, రెడ్డిసుబ్రహ్మణ్యం, సూత్రం కిరణ్ కుమా ర్ శర్మ, అప్పిస్వామి, ఆనంద్ స్వామి, కృష్ణప్రసాద్ స్వామి, సంతోశ్ స్వామి, తెనాలి గిరిధర్ రావు, శ్రీకాంత్, లలితాంబ, రెడ్డిభావిక, మధుబాల, భరత్ పాల్గొన్నారు.

మదనపల్లి అర్బన్‌లో: స్థానిక కురవంకలో బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివస్వామి, చలపతి స్వామి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య మాట్లాడుతూ శ్రౌత, స్మార్తక కర్మలను పునర్ధరించి వైదిక మతాన్ని పునఃస్థాపితం చేయడానికి స్వయంగా శంకరుడే భూమిపై అవతరించాడన్నారు. ఆ వైదిక ధర్మాన్ని ప్రతిష్ఠించి నిరంతరంగా కొనసాగడానికి ఆసేతుహిమాచలం వరకు కాలినడకన మూడు సార్లు పర్యటించి దేశానికి నలువైపులా నాలుగు పీఠాలను స్థాపించిన మహనీయ్యుడు శంకరాచార్యులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాద్‌రావు , రఘునందన్ ప్రకాశ్ , కేశవాచార్యులు , సి ప్రకాశ్ , యాటీఐ మధు , శర్మఅమర్నాథ్ తదితరుతు పాల్గొన్నారు.



పీలేరులో శంకర జయంతి నిర్వహిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

ఓటరన్నా! మంచి పాలకులను ఎంచుకో..!

మదనపల్లె అర్బన్, మే12: ఐదేళ్లకు ఒకసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు చైతన్యవంతులై వారి ఓటును తప్పకుండా వినియోగించుకుని మంచి పాలకుడిని ఎన్నుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ప్రధాన ఆయుధం. ఈ ఓటు ఆయుధంతో యువత నాయకుల తలరాతను మార్చడమే కాకుండా ప్రజలకు అన్ని విధాల సేవలందించే వారిని గెలిపించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసే అవకాశం ఓటరుకు వచ్చింది. అందు వల్ల సోమవారం జరిగే ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వామ్మో వేసవి ఎండలు ఎందుకులే అనుకోకుండా ఓటును వినియోగించుకోవడంతోపాటు అందరిని ఓటింగ్‌లో పాల్గొనేలా ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉంది. తమతమ ప్రాంతాల ఎమ్మెల్యేతోపాటు ఎంపీ అభ్యర్థులను మంచివారిని, అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడేవారిని ఓటు ద్వారా ఎన్నుకుని మీ ప్రాంతాలతోపాటు రాష్ట్రానికి మంచి నాయకుడిని ఎంపికచేసుకోండి. అరాచకాలు, దౌర్జన్యాలకు స్వస్తిపలికి శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడే వారిని తప్పకుండా ఎన్నికల్లో ఆదరించాల్సిన సమయం యువత చేతుల్లోనే ఉంది.

ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం

గుర్రంకొండ, మే 12:గుర్రంకొండ మ ండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం పునర్నిర్మాణానికి దాతలు ఆదివారం విరాళం అందజేశారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొత్తపల్లెకు చెందిన దాత సందీప్ రూ.50 వేలను అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి వితరణగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని ఈ సందర్భంగా ఆయన ఆలయ అధికారులను కోరారు. అనంతరం దాతకు ఆలయంలో అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక కిట్ల పంపిణీ

మదనపల్లె టౌన్, మే 12: ఎన్నికల సంఘం ఆదేశాలతో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే అధికారులకు రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక కిట్ చొప్పున పంపిణీ చేశారు. ఈ బ్యాగ్‌లో ఆరు టూత్ బ్రష్షులు, ఒక టూత్‌పేస్ట్, ఆరు టంగ్ క్లీనర్లు, ఆరు సోపులు, ఆరు క్రాక్‌జాక్, ఆరు గుడ్‌డే బిస్కెట్‌ప్యాకెట్లు, ఒక చాక్లెట్ ప్యాకెట్‌తో పాటు ఒక శానిటరి నాప్‌కిన్ ప్యాకెట్‌ను ఈ కిట్‌లో వుంచారు. అన్ని పోలింగ్ కేంద్రాల సిబ్బందికి ఎన్నికల సామాగ్రితో పాటు వాటిని పంపిణీ చేశారు.



పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేసిన ప్రత్యేక కిట్‌లోని వస్తువులు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె అర్బన్, మే12: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరవుతున్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లెలోని జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల విధులకు హాజరైన పోలీసులకు శిక్షణ తోపాటు ఐపీఎస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ చెప్పారు. ఓటర్లు ప్రశాంతవాతావరణంలో తమ ఓట్లు వినియోగించుకొనే విధంగా పోలీసుల కృషి ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేవారిని, ఆ ప్రాంతాలను పరిశీలనలో ఉంచాలన్నారు. అనుమానం వచ్చిన వారిని వెంటనే పరిశీలించి వారి గుర్తింపు కార్డులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ప్రభుత్వాస్పత్రిలో ఓ వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్

మదనపల్లె టౌన్, మే 12: మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో శనివారం రాత్రి ఓ వ్యక్తి ఫూటుగా మద్యం తాగి వచ్చి అత్యవసర విభాగంలో హల్‌చల్ చేశాడు. కలకడ మండలం మహల్‌కు చెందిన బాషా అనే వ్యక్తి ఒళ్లు బాగలేదని రాత్రి క్యాజువాలిటికి వచ్చాడు. అక్కడి వైద్య సిబ్బంది మరుసటి రోజు ఉదయం అవుట్ పేషెంట్ విభాగంలో చూపించుకోవాలని సూచించారు. దీంతో బాషా గట్టిగా అరుస్తూ, మద్యం మత్తులో చిందులేశాడు. అంతే కాకుండా చెప్పులు తీసి విసురుతూ ఎగిరి గంతులు వేశాడు. అంతేకాకుండా అక్కడ వుంచిన కుర్చీలు, బెంచీలు ఎక్కి బ్యానర్లను చించుతూ హంగామా చేశారు. దీంతో అక్కడడ్యూటీ డాక్టర్లు, వైద్యసిబ్బంది హడలెత్తిపోయారు. అతడిని వారించాల్సిన సెక్యూరిటి సిబ్బంది బెంబేలెత్తి చూస్తూ ఉండిపోయారే కాని, అతని హంగామాను అడ్డుకోలేకపోయారు. చివరికి బాషా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.